మంగళవారం
04-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 281
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పది పరీక్షలు ప్రారంభం

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల మూల్యాంకాన్ని ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకూ నిర్వహించి, ఫలితాలను వేగవంతంగా ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలకు సిద్ధమైంది.

2లో

'ముందస్తు' కోసమేనా ?

- జనసేన అధినేతకు కమలనాథుల ఆహ్వానం
- ఢిల్లీ చేరుకున్న పవన్, మనోహర్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కాషాయ పార్టీ అధినేతల నుంచి పిలుపు వచ్చింది. దీంతో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ సోమవారం హుటాహుటిన ఢిల్లీ వెళ్లారు. జనసేన నేతలకు ఢిల్లీ పిలుపుతో ఏపీలో ముందస్తు ఎన్నికల ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు ఢిల్లీ వెళ్లి రావడం, సోమవారం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సమావేశం కావడంతో ముందస్తు ఎన్నికలు ఖాయమని అధికారపార్టీ నేతల్లోనే చర్చ జరుగుతోంది. పైకి మాత్రం ముఖ్యమంత్రి గడువు ప్రకారమే వచ్చే ఏడాది ఎన్నికలు జరుగుతాయని చెపుతున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రంతో పాటు ఎన్నికలు

- మిగతా 2 లో

పేదల ఇళ్ల స్థలాలకు రాజధాని భూములు

- మళ్లీ సీఆర్‌డీఏ వివాదాస్పద నిర్ణయం
- హైకోర్టును ఆశ్రయించిన రైతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని నిర్మాణం కోసం రైతులు ఇచ్చిన భూములను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పేదలకు కేటాయించాలని నిర్ణయించింది. గతంలో ఇదే నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టినప్పటికీ మళ్లీ సీఆర్‌డీఏ అదే నిర్ణయాన్ని తీసుకుంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఇళ్లు లేనివారికి అమరావతిలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన 33వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయించారు. లబ్ధిదారుల జాబితాతో డీపీఆర్‌లు తయారు చేయాలని గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రతిపాదనలు సీఆర్డీఏకు అప్పగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించేలా తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని సీఎం సూచించారు. మే నెల మొదటివారం నాటికి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లులేని పేదల చిరకాల వాంఛ నెరవేర్చే ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈమేరకు అమరావతిలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కోసం ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ జీవో 45 కూడా జారీ అయింది. రాజధాని ప్రాంతంలో మొత్తం 1134.58 ఎకరాల భూమి పేదల ఇళ్లకోసం కేటాయించారు. మొత్తం 20 లే అవుట్లలో స్థలాలు కేటాయింపు జరగనుంది. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 48, 218 మంది పేదలకు ఇళ్ల పట్టాలు కేటాయించనున్నారు. ఐనవోలు, మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, కూరగల్లు, నిడమనూరు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తారు.

జీవో నంబర్ 45పై రాజధాని ఐకాస లంచ్ మోషన్ పిటిషన్

రాజధాని అమరావతి పరిధిలో ఇతర జిల్లాల వారికి ఇళ్ల స్థలాల కేటాయింపునకు

- మిగతా 2 లో

25 మంది అవుట్?

- గడపగడపకు కొనసాగించాల్సిందే
- సెప్టెంబరు 1 వరకూ గడువు
- మంత్రులు ధర్మాన, బుగ్గన డుమ్మా
- కొంతమంది ఎమ్మెల్యేలు గైర్హాజరు
- 13 నుంచి జగనన్నకు చెబుదాం
- సమీక్షలో సీఎం వైఎస్ జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పనితీరు సరిగా లేకపోతే వేటు తప్పదని ఎమ్మెల్యేలకు వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. గడప గడపకు సమీక్షలో చాలామంది ఎమ్మెల్యేలకు జగన్ షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 25 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని జగన్ హెచ్చరించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'పై ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం జగన్ సమీక్షించారు. 25 మంది ఎమ్మెల్యేలు వెనుకబడ్డారని, గ్రాఫ్ పెంచుకోవాల్సిన అవసరం ఉందని, లేకపోతే నష్టపోతారని సుతిమెత్తని హెచ్చరికలు జారీ చేశారు. జగన్ హెచ్చరికతో ఆ ఎమ్మెల్యేలంతా మనస్తాపానికి గురైనట్లు తెలిసింది. మరో ఏడాదిలో ఎన్నికలు ఉన్నాయన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఏ ఒక్క ఎమ్మెల్యేనూ వదులుకోవడానికి తాను సిద్ధంగా లేనని, ఇక నుంచి అందరూ నెలకు 25 రోజులు ప్రజలతోనే ఉండాలని హితబోధ చేశారు. సెప్టెంబరు ఒకటి నాటికి గడపగడపకు మన ప్రభుత్వం, ఇతర కార్యక్రమాలు పూర్తి చేయాలని జగన్ ఆదేశించారు. కాగా, సమీక్ష సమావేశానికి మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ధర్మాన ప్రసాదరావు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సహా కొంతమంది ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది.

13 నుంచి జగనన్నకు చెబుదాం

ఒకవైపు గడపగడపకు మన ప్రభుత్వం కొనసాగిస్తూనే...ఈనెల 13 నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం జగన్ వెల్లడించడంతో ఎమ్మెల్యేలు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే గడప గడపకు తిరగలేక చాలామంది ఎమ్మెల్యేలు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏకకాలంలో రెండు కార్యక్రమాలను కొనసాగించడం తలకు మించిన భారంగా ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. పనితీరు బాగోలేదని హెచ్చరించినందుకు నలుగురు ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై తిరుగుబావుటా ఎగురవేయడం, తుదకు వారంతా పార్టీని వీడటం వైసీపీకి తీరని నష్టంగా మారింది. దానిని గుర్తించిన జగన్ ఈసారి ఎమ్మెల్యేలకు సుతిమెత్తని హెచ్చరికతో...బుజ్జగింపు ధోరణి ప్రదర్శించినట్లు తెలుస్తోంది. 40 మంది ఎమ్మెల్యేలు పార్టీకి దూరమవుతారన్న నిఘావర్గాల సమాచారంతో జగన్ ఆచితూచి వ్యవహరించారు. కాగా, నెలకు 9 సచివాలయాలు పూర్తి చేసే లక్ష్యంతో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ముందుకెళ్లాలని జగన్ ఆదేశించారు. ఈ టార్గెట్లతో ఎమ్మెల్యేలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అదే జరిగితే 175 స్థానాల్లో వైసీపీ గెలుపు ఖాయమంటూ సీఎం దీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ...ఆ దిశగా ఎమ్మెల్యేలలో జోష్ కనిపించలేదు. ఒకవైపు గడప గడపకు కొనసాగుతుందని, మరోవైపు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను మమేకం చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 'నేను చేయాల్సింది నేను చేయాలి...మీరు చేయాల్సింది మీరు చేయాలి. ఆ రెండు సంయుక్తంగా సమర్థవంతంగా జరిగితే 175/175 స్థానాల్లో గెలుస్తామని ఎమ్మెల్యేలకు సీఎం దిశానిర్దేశం చేశారు.

గేర్ మార్చాలి: జగన్

ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు గేరు

- మిగతా 2 లో

పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

జైలుశిక్ష తీర్పు అప్పీల్‌పై 13న విచారణ

గాంధీనగర్: పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. సూరత్ సెషన్స్ కోర్టు సోమవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అయితే కిందికోర్టు తనకు విధించిన జైలు శిక్ష తీర్పుపై మధ్యంతర స్టే విధించాలని రాహుల్‌గాంధీ చేసిన అభ్యర్థనపై ఇప్పుడే తీర్పు చెప్పలేమని వెల్లడించింది. దీనిపై తదుపరి విచారణను ఏప్రిల్ 13కు వాయిదా వేసింది. మోదీ ఇంటిపేరును కించపరిచారన్న అభియోగాలపై రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఇటీవల సూరత్ విచారణ కోర్టు తీర్పు వెలువరించింది. దీనిపై సోమవారం ఆయన గుజరాత్‌లోని సూరత్ జిల్లా సెషన్స్ కోర్టులో అప్పీల్ చేసుకున్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీనియర్ నేతలు, సోదరి ప్రియాంకాగాంధీ వెంట రాగా... ఆయన సూరత్

- మిగతా 2 లో

ఎన్నికలంటే జగన్‌కు భయం

- మేమెవరితో కలిస్తే మీకెందుకు?
- రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా స్పందించని సీఎం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్రబ్యూరో-బాపట్ల: ఎన్నికలంటే సీఎం జగన్‌కు భయమని, ముందస్తు ఎన్నికలకు వెళితే ముందుగా ఇంటికి పంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బాపట్లలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం రామకృష్ణ మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నేత పేర్ని నానిలో భయం కనిపిస్తోందని రామకృష్ణ అన్నారు. భయం కారణంగానే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమైనా తమను ఏమీ చేయలేవని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. 87 శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందితే...ఎన్నికలంటే ఎందుకు పడుతున్నారని ప్రశ్నించారు. 'చంద్రబాబు 175 సీట్లలో, పవన్ కల్యాణ్ 175 సీట్లలో పోటీ చేయగలరా? సీపీఐ నేతలు నారాయణ, రామకృష్ణ ఎర్రజెండా పట్టుకుని తెలుగుదేశంతో ఎందుకు కలుస్తున్నారంటున్నావ్. మేము కలిస్తే మీకు భయమెందుకు?' అని నిలదీశారు. ఓటుకు వేల రూపాయలు పంచినా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమి చెందినందుకే వైసీపీకి భయం పట్టుకుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ విశాఖ కేంద్రంగా పాలన సాగిస్తారని చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీని ఘోరంగా ఓడించారని తెలిపారు. కర్నూలుకు హైకోర్టు వస్తుందని ప్రచారం చేసుకున్నా పట్టభద్రుల ఎన్నికల్లో పులివెందుల వ్యక్తే గెలిచారన్నారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టావో చెప్పాలని సీఎం జగన్‌కు రామకృష్ణ సవాల్ విసిరారు. వ్యవసాయం, పరిశ్రమలు, ఐటీ రంగాలకు సంబంధించి ఏమి అభివృద్ధి జరిగిందని నిలదీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీ అమలు కాలేదని విమర్శించారు. మద్యపాన నిషేధం ఏమైందని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం కేంద్రం మెడలు వంచుతానన్నావు...ఏమి చేశావు? హోదా సాధించావా; విభజన హామీలు సాధించావా? కడప స్టీలు ఫ్యాక్టరీ తెచ్చావా? రామాయపట్నం పోర్టు ఏమైంది? విశాఖ రైల్వే జోన్ సంగతేంటి? అని ప్రశ్నల వర్షం కురిపించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అడ్డుకోలేకపోతున్న చేతకాని సీఎం జగన్ అని మండిపడ్డారు. స్వప్రయోజనాల కోసం నరేంద్రమోదీ కాళ్లు పట్టుకోవటం తప్ప రాష్ట్రానికి ఏమి సాధించామని రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టుకు నిధులు

- మిగతా 2 లో

ఐదుగురు మావోయిస్టుల మృతి

- జార్ఖండ్‌లో ఎదురు కాల్పులు
- భారీగా ఆయుధాలు స్వాధీనం
- మృతుల్లో అగ్రనేతలు?

విశాలాంధ్ర-చింతూరు: జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. చత్ర జిల్లా సరిహద్దులో భద్రతా బలగాలు- మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా అందులో జార్ఖండ్ మావోయిస్టు పార్టీ సెక్రటరీ అరుణతో పాటు అగ్ర నేతలు గౌతమ్ పాశ్వాన్, చార్లెస్ ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలిలో రెండు ఏకే-47 తుపాకులతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పోరాటం ఆగదు

- చేనేత కార్మికసంఘం నేతల స్పష్టీకరణ
- ధర్మవరంలో నేతన్నల 36 గంటల దీక్ష ప్రారంభం

విశాలాంధ్ర-ధర్మవరం టౌన్: నేతన్నల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడతామని ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింక చలపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ స్పష్టంచేశారు. సమస్యల పరిష్కారం కోసం ధర్మవరం ఎమ్మార్వో కార్యాలయ వద్ద చేనేత కార్మికులు చేపట్టిన దీక్ష కార్యక్రమానికి వారు హాజరయ్యారు. జింక చలపతి, వెంకటస్వామి, రమణ, మంజునాథ్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, చంద్ర దీక్షలో కూర్చున్నారు. కైకాల చేనేత కార్మిక సంక్షేమ సంఘం విజయవాడ

- మిగతా 2 లో

ఏకతాటిపైకి విపక్షాలు

- కుల గణనతోనే సామాజిక న్యాయం
- మోదీ సర్కారును గద్దె దించడానికి ఐక్యపోరు

న్యూఢిల్లీ: కుల గణన చేసి తీరాల్సిందేనని విపక్ష నేతలు స్పష్టంచేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మోదీ సర్కారును గద్దె దించడానికి విపక్షాలన్నీ ఏకతాటిపైకి రావాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. సామాజిక న్యాయంపై డీఎంకే అధ్వర్యంలో సోమవారం ఇక్కడ విపక్షాల సమావేశం జరిగింది. ప్రతిపక్షాల పటిష్ఠతను సమావేశం చాటిచెప్పింది. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ అధ్యక్షత వహించారు. రాజస్థాన్, జార్ఖండ్ ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాత్, హేమంత్ సోరెన్, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పాల్గొన్నారు. బలహీనవర్గాల అణచివేతపై నేతలు గళం విప్పారు. కుల గణన చేయాలన్న తేజస్వి యాదవ్ డిమాండ్‌కు ప్రతిపక్ష నేతలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీహార్‌లోని మహాగట్బంధన్ ప్రభుత్వం ఇప్పటికే కుల గణన సర్వే ప్రారంభించిందని తేజస్వి చెప్పారు. ఓబీసీలకు మరిన్ని రిజర్వేషన్లు కావాలని చత్తీస్‌గఢ్, జార్ఖండ్ ప్రభుత్వాలు కోరుతున్నాయని, కానీ దీనిని గవర్నర్లు అడ్డుకుంటున్నారని, ఇది ఆందోళన కలిగిస్తోందని తేజస్వి అన్నారు. గవర్నర్లు అడ్డుకోవడం వెనుక ఎవరున్నారో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. తమ అహాన్ని పక్కన పెట్టి అందరం ఏకతాటిపైకి రావాలని ఆయన విపక్ష నేతలకు విన్నవించారు. సామాజిక న్యాయం ప్రాతిపదికన చేసే రాజకీయాల ద్వారా బీజేపీ విభజన రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఆర్‌జేడీ నేత మనోజ్ ఝా మాట్లాడుతూ కుల గణన చేయకపోతే అసలు జనాభా లెక్కలనే బహిష్కరిద్దామని విజ్ఞప్తి చేశారు. కుల

- మిగతా 2 లో

ఫిన్లాండ్‌లో ప్రతిపక్షపార్టీ విజయకేతనం

హెల్సింకీ : ఫిన్లాండ్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిపక్ష నేషనల్ కోయలిషన్ పార్టీ విజయం సాధించింది. ఫిన్లాండ్ జాతీయ ప్రసారకర్త యెల్ నివేదించిన ప్రాథమిక ఫలితాల ప్రకారం ఆదివారం జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో ఫిన్‌లాండ్ ప్రతిపక్ష నేషనల్ కోయలిషన్ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఫిన్లాండ్ నేషనల్ కోయలిషన్ పార్టీ నాయకుడు పెట్టెరి ఓర్పో ఈ సందర్భంగా హెల్సింకిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తమ విజయానికి కారకమైన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో నేషనల్ కోయలిషన్ పార్టీ 48 సీట్లు గెలుచుకుంది. నాలుగేళ్ల క్రితం కంటే సీట్ల సంఖ్య పదికిపైగా పెరిగింది, ఫిన్స్ పార్టీ 46 సీట్లలో ఏడు పెరిగాయి. ప్రధానమంత్రి సన్నా మారిన్ అధ్యక్షతన ఉన్న ప్రస్తుత ఫిన్‌లాండ్ సంకీర్ణంలో ప్రధాన పార్టీ సోషల్ డెమోక్రటిక్ పార్టీ 3 స్థానాలు పెరిగి 43 స్థానాలను గెలుచుకుంది. ఈ దఫా ఓటింగ్ శాతం 71.9శాతం నమోదైంది. జాతీయ కూటమి పార్టీ నాయకుడు పెట్టేరి ఓర్పో మాట్లాడుతూ, ఇది పార్టీకి ముఖ్యమైన విజయమని, తన నాయకత్వంలో నూతనతరహా ప్రభుత్వం ఏర్పాటు చేస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. నేషనల్ కోయలిషన్ పార్టీ, ఫిన్స్ పార్టీ ఎన్నికల ఫలితాలపై మారిన్ అభినందనలు తెలిపారు. తన పార్టీ పనితీరుపై తాను కూడా సంతృప్తిగా ఉన్నానని పేర్కొన్నారు. సెంటర్ పార్టీ ఎనిమిది స్థానాలను కోల్పోయింది, గ్రీన్స్ ఏడు స్థానాలను కోల్పోయింది లెఫ్ట్ అలయన్స్ పార్టీ ఐదు స్థానాలను కోల్పోయింది. రెండు మితవాద పార్టీలైన నేషనల్ కోయలిషన్ పార్టీ, ఫిన్స్ పార్టీలు కలిసినప్పటికీ పార్లమెంటులో తమ మెజారిటీకి తక్కువగా ఉన్నందున సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుపై చర్చలకు కొంత సమయం పట్టవచ్చని ప్రభుత్వ ఏర్పాటుకు చిన్న పార్టీల మద్దతు అవసరమని ఓర్పో పేర్కొన్నారు.

6 నుంచి స్వాజిలాండ్ కమ్యూనిస్టుపార్టీ మహాసభలు

కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ స్వాజిలాండ్ (సీపీఎస్) 5వ జాతీయ కాంగ్రెస్ ఏప్రిల్ 6 నుంచి 9వరకు దక్షిణాఫ్రికాలోని పుమలంగా ప్రాంతంలో జరగనున్నాయి. ఆఫ్రికా ఖండంలో స్వాజిలాండ్ కమ్యూనిస్ట్ పార్టీ 2011లో స్థాపించడమైంది. కింగ్ ఎస్వాతిని2 పాలనలో దోపిడీ, పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా స్వాజిలాండ్ ప్రజలు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. దేశంలో పేదరికం, రోగాలు, మహిళల అణచివేత, యువతను అణిచివేసే సమాజంలో విప్లవాత్మక పరివర్తన కోసం సీపీఎస్ ఆధ్వర్యంలో దీర్ఘకాలంగా పలు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. దేశంలో పేట్రేగిపోయిన నిరంకుశత్వం, పెట్టుబడిదారీ వ్యవస్థ అంతం చేయాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నామని సీపీఎస్ పేర్కొంది. సీపీఎస్ దేశంలో నిరంకుశత్వాన్ని పూర్తిగా అంతం చేయడానికి, స్వేచ్ఛా, ప్రజాస్వామ్య బహుళ-పార్టీ వ్యవస్థను స్థాపించాలని కోరుతూ సోషలిజం కోసం పోరాడుతూనే ఉంది. స్వాజిలాండ్ కమ్యూనిస్ట్ పార్టీ అంతర్జాతీయ కమ్యూనిస్ట్, వర్కర్స్ పార్టీల సమావేశంలో (ఐఎమ్‌సీడబ్ల్యుపీ)లో పాల్గొంటుంది.

సీజీటీ ప్రధాన కార్యదర్శిగా బినెట్ ఎన్నిక

పారిస్: జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ (సీజీటీ) ప్రధాన కార్యదర్శిగా సోఫీ బినెట్(41) ఎన్నికను ఫ్రెంచ్ కమ్యూనిస్టులు స్వాగతించారు. ఫ్రాన్స్‌లో 1895లో స్థాపించిన రెండవ అతిపెద్ద యూనియన్‌కు నాయకురాలిగా ఎన్నికకావడంపై యూనియన్ ప్రజలు హర్షం వెలిబుచ్చారు. లెఫ్ట్ వింగ్ సభ్యురాలైన బినెట్ సీజీటీ మొదటి మహిళా నాయకురాలిగా ఎంపికయ్యారు. దేశంలో పెన్షన్ సంస్కరణలపై ప్రభుత్వంతో తన పోరాటాన్ని కొనసాగిస్తానని ఆమె ప్రతిజ్ఞచేశారు. సీజీటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికకావడంపై సంతోషాన్ని వ్యక్తంచేశారు. 128 ఏళ్ల చరిత్రలో వామపక్ష యూనియన్ ఫెడరేషన్‌కు నాయకత్వం వహించిన మొదటి మహిళ ఆమె. బినెట్, పాఠశాలల సూపర్‌వైజర్, జనరల్ యూనియన్ ఆఫ్ ఇంజనీర్స్, ఎగ్జిక్యూటివ్‌లు, సాంకేతిక సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న యూనియన్‌లో ఒక విభాగానికి ఆమె అధిపతి. ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఫాబియన్ రౌసెల్ సీజీటీ అధిపతిగా ఎన్నికైనందుకు సోఫీ బినెట్‌కు, ఆమె బృందానికి అభినందనలు తెలియజేస్తున్నానని ట్వీట్‌చేశారు. ట్రేడ్ యూనియన్ ప్రపంచంలో సాటిలేని శక్తిగా పేర్కొన్నారు. దేశంలో పెన్షన్ హక్కులపై అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌పై దాడికి ఫ్రెంచ్ యూనియన్లు తమ వ్యతిరేకతను కొనసాగించడంతో బినెట్ బాధ్యతలు స్వీకరించారు. సీజీటీ ఫ్రాన్స్‌లో రెండవ అతిపెద్ద యూనియన్ ఫెడరేషన్. దేశంలో పదవీ విరమణ వయస్సును 62 నుండి 64కి పెంచాలనే ప్రభుత్వ ప్రణాళికను నిరోధించే ప్రయత్నంలో భాగంగా ఇతర యూనియన్‌లతోకలిసి సీజీటీ ఐక్య ఫ్రంట్‌ను ఏర్పాటు చేసింది. జనవరి నుంచి యూనియన్లు మాక్రాన్ విధానాలకు వ్యతిరేకంగా పలు దఫాలు దేశవ్యాప్త సమ్మెలు, భారీ నిరసనలను చేపట్టారు. వచ్చే వారం చేపట్టనున్న ప్రణాళికలపై చర్చించడానికి యూనియన్‌లకు ప్రధానమంత్రి ఎలిసబెత్ బోర్న్ నుండి ఆహ్వానం అందినట్లు బినెట్ పేర్కొన్నారు.

చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేయాలి

కార్మికుల కోర్కెలు పరిష్కరించాలి

సీఎంకు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని, చేనేత కార్మికుల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టి, ఆ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు సోమవారం ఆయన లేఖ రాశారు. యాభై ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడిందని, చేనేత కార్మికులకు ఉపాధి కరువై అల్లాడుతున్నారని వివరించారు. అనూహ్యంగా మరమగ్గాల వైలెషన్ ఉత్పత్తులు పెరిగి పట్టుచీరల నిల్వలు ఎక్కడికక్కడ పేరుకుపోవడమే ఈ సంక్షోభానికి కారణమన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో చేనేతకు కేటాయించిన డిజైన్లను మరమగ్గాల ద్వారా పెద్దఎత్తున తయారు చేస్తున్నారని వివరించారు. డిమాండ్‌కు మించి చేనేత ఉత్పత్తుల నిల్వలు పేరుకుపోయి మగ్గాలు మూతపడుతున్నాయని, దీంతో చేనేత కార్మికులతోపాటు మరమగ్గాల కార్మికులూ ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ నేతన్నలు ధర్మవరంలో 36 గంటల భరోసా దీక్షను చేపట్టారన్నారు. సాక్షత్తూ పార్లమెంటు ద్వారా తీసుకొచ్చిన చట్టాన్ని అమలు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ ఆందోళన చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడడం విచాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేనేత రిజర్వేషన్ చట్టం అమలుకు తక్షణ చర్యలు తీసుకుని, వేలాది మంది జీవనం పొందుతున్న చేనేత రంగాన్ని పరిరక్షించాలని, చేనేత 11 రకాల రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని, మరమగ్గాలలో ఫీవర్ నుంచి ఫీవర్ వేయడాన్ని అడ్డుకోవాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలన్నారు. చేనేత కార్మికులకు సిల్క్ రాయితీ స్కీమ్ పునరుద్ధరించాలని, ప్రతి చేనేత కుటుంబానికి 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలి మగ్గం, అన్ని చేనేత అనుబంధ కార్మికులకు నేతన్న నేస్తం ఇవ్వాలని, చేనేతపై జీఎస్టీ ఎత్తివేయాలని, ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని, ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాను రూ.1.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు రాయితీపై మెటీరియల్ సరఫరా చేసి, అమ్మకంపై మార్కెట్ మద్దతు ధర ఇవ్వాలనే చేనేత కార్మికుల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో రామకృష్ణ డిమాండ్ చేశారు.

పోరాటం ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

దీక్షా శిబిరంలోనే నిద్రిస్తున్న చేనేత నాయకులు

నాయకులు కేలసాని సాయికుమార్, ధర్మవరం నియోజకవర్గం కార్యదర్శి మధు, ఏపీ చేనేత కార్మిక సంఘం(సీపీఎం) రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు సంఘీభావం తెలిపారు. జింక చలపతి, పిల్లలమర్రి నాగేశ్వరరావు, వేమయ్య యాదవ్ మాట్లాడుతూ చేనేత కార్మికుల హక్కులు, సమస్యలను పరిష్కరించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తమ డిమాండ్లపై స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని మండిపడ్డారు. కొన్ని సమస్యలనైనా పరిష్కరించడానికి ముందుకొచ్చిన కలెక్టర్‌కు ఎమ్మెల్యే అడ్డంకులు సృష్టించడం దారుణమన్నారు. మరమగ్గాల యాజమాన్యంతో ఎమ్మెల్యే కుమ్మక్కయ్యారని ఆరోపించారు. చేనేత కార్మికుల ఆకలి చావులు, ఆత్మహత్యలు ఆపాల్సిన బాధ్యత కలెక్టర్‌కు లేదా అని నిలదీశారు. చేనేత కార్మికుల కోసం ఎంపీ గోరంట్ల మాధవ్ చేసింది శూన్యమన్నారు. నేతన్నలంతా ఐక్యంగా పోరాడితేనే న్యాయం జరుగుతుందని స్పష్టంచేశారు. సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించకపోతే ఎమ్మెల్యే ఇంటి వద్ద, కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయడం లేదని నిందించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా చేనేత కార్మికుల బ్రతుకులు మారడం లేదని ఆగ్రహం వెలిబుచ్చారు. చేనేతపై 18 శాతం జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల జీవితాల గురించి జగన్ ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నేతన్నలకు భరోసా కల్పించేందుకే 36 గంటల దీక్ష చేపట్టినట్లు తెలిపారు.ఎన్‌ఫోర్సుమెంటు కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని, సిల్క్ రాయితీ పథకాన్ని పునరుద్ధరించాలని, 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్మవరంలో మెగా చేనేత క్లస్టరు ఏర్పాటు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల దీక్షకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి మద్దతు తెలిపారు. కాగా, పోలీసుల అత్యుత్సాహంతో దీక్ష శిబిరం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనుమతి లేదన్న సాకుతో ఒకటో పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ మహమ్మద్ రఫీ మైకు లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, నిరసనకారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నాయకులు వెంకటనారాయణ, జేవీ రమణ, రవి, రాజా, కుల్లాయప్ప, పోతులయ్య, విజయభాస్కర్ సహా వందలాదిమంది చేనేత కార్మికులు పాల్గొన్నారు.

రాజధాని భూములు

(మొదటిపేజీ తరువాయి)

ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 45పై రాజధాని రైతు ఐక్య కార్యాచరణ సమితి నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. రైతుల తరపున సుప్రీంకోర్టు న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. ఇదే విషయంపై గతంలో పిటిషన్ పెండింగ్‌లో ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్ళారు. ప్రధాన పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, ప్రభుత్వం జీవో విడుదల చేయడం నిబంధనలకు విరుద్ధమని కోర్టుకు తెలిపారు. గతంలో ఆర్-5 జోన్‌పై జీవోను హైకోర్టు సస్పెండ్ చేసిందని గుర్తు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రధాన పిటిషన్ ఎవరి వద్ద ఉందని ప్రశ్నించింది. త్రిసభ్య ధర్మాసనం వద్ద ఉందని పిటిషనర్ సమాధానమిచ్చారు. దీంతో తాజా పిటిషన్‌ను పెండింగ్ పిటిషన్‌తో జత చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది.

పది పరీక్షలు ప్రారంభం

కేంద్రాల వద్ద సందడి

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

19 నుంచి మూల్యాంకనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల మూల్యాకాన్ని ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకూ నిర్వహించి, ఫలితాలను వేగవంతంగా ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలకు సిద్ధమైంది. మొత్తం 3,349 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఒక్కో గదిలో 24 మంది విద్యార్థులే ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పరీక్షల సంచాలకులు దేవానందరెడ్డి పర్యవేక్షణలో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను కల్పించారు. విద్యార్థుల రాకపోకలకు సమస్య తలెత్తకుండా ఆర్టీసీ యాజమాన్యం బస్సులను నడిపింది. ఈ పరీక్షలు జరిగే సమయాల్లో విద్యార్థుల హాల్ టిక్కెట్‌ను చూపి ఉచితంగా ప్రయాణించేలా అవకాశం కల్పించింది. పరీక్షలు ప్రారంభం కావడంతో విజయవాడతోపాటు అన్ని నగరాల్లోనూ ఆయా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల హడావుడి నెలకొంది. అటు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తమ విద్యార్థులను ప్రత్యేక బస్సుల ద్వారా పరీక్షా కేంద్రాలకు తరలించింది. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, కన్నడం, తమిళం, ఒడియా, ఉర్దూ మాధ్యమాల్లో రోజు విడిచి రోజు ఆరు పేపర్లలో పరీక్షలను సీబీఎస్ఈ తరహాగా ఎస్ఎస్‌సీ బోర్డు ప్రణాళిక రూపొందించింది. దీంతో విద్యార్థులు ఆయా పరీక్షల సన్నద్ధతకు మధ్యలో సెలవులు రావడం ఎంతో దోహదపడుతుంది. ఈ పరీక్షల నిర్వహణ కోసం 43వేల సిబ్బందిని నియమించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులనే ఇన్విజిలేటర్లుగా నియమించారు. సమస్యాత్మకంగా గుర్తించిన 104 పరీక్షా కేంద్రాల్లో సీసీ కేమేరాలు ఏర్పాటు చేశారు.

'ముందస్తు' కోసమేనా ?

(మొదటిపేజీ తరువాయి)

జరగడం ఖాయమని పార్టీ నేతలు సన్నద్ధమవుతున్నారు. ప్రతిపక్ష పార్టీలు కూడా ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ఢిల్లీ వెళ్ళి వచ్చిన మూడోరోజే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా పిలుపురావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బీజేపీతో కల్సి జనసేన పోటీ చేయాలని ఒత్తిడి చేయడం కోసమే కమలనాథులు ఆహ్వానించి ఉంటారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటుండగా, ఢిల్లీ వెళ్లిన పవన్ తొలుత బీజేపీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్, కేంద్రమంత్రి మురళీధరన్‌తో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో తాజా రాజకీయ పరిస్థితులతోపాటు జనసేన, బీజేపీ కార్యాచరణపై భేటీలో చర్చించినట్లు తెలుస్తోంది. రెండు పార్టీల మధ్య దూరం పెరిగిందని రాష్ట్ర బీజేపీ నేతలు బాహాటంగానే ప్రకటించిన విషయం తెలిసిందే. జనసేనతో కలిసి ఉన్నా, లేకపోయినా ఒకటేనని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ గతంలో వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం రెండు పార్టీల పెద్దలు ఢిల్లీలో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. భేటీ అనంతరం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఇంకా కొంతమంది నేతలను కలవాల్సి ఉందని, అందరినీ కలిసిన తర్వాత మాట్లాడుతానని వెల్లడించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షులు నడ్డాలతో కూడా వరుస భేటీలు ఉండనున్నట్లు జనసేన నేతలు తెలిపారు.

ఏకతాటిపైకి విపక్షాలు

(మొదటిపేజీ తరువాయి)

గణన చేయకపోతే జనాభా లెక్కలకు సహకరించేది లేదని తాము స్పష్టంగా పిలుపునిస్తున్నామన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ మాట్లాడుతూ బీజేపీపై పోరాడటానికి ఇప్పటికీ కొన్ని పార్టీలు సిద్ధంగా లేవని చెప్పారు. మోదీ ప్రభుత్వంపై జరిగే యుద్ధంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ భాగస్వాములు కావాలని విన్నవించారు. ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ మాట్లాడుతూ కుల గణనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వర్ణ వ్యవస్థను కొనసాగించాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటున్నందున కుల గణనకు బీజేపీ దూరంగా ఉంటుందని విమర్శించారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ భారతదేశం భవిష్యత్ ఆశాజనకంగా మారాలంటే కులం, వర్గం, మతం, వర్ణం వంటి వాటికి అతీతంగా ప్రజలంతా ఒక్కటి కావాలని సూచించారు. భారత్ వెలుగులు విరజిమ్మాలంటే ప్రతిఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని ఆ దిశగా నడిపించడానికి ప్రయత్నిస్తున్న ఎంకే స్టాలిన్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. యూపీ మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ, ఎన్‌సీపీ నేత చగన్ భుజ్‌బల్, ఐయూఎంఎల్ నేత ఈటీ మహ్మద్ బషీర్, బీఆర్ఎస్ నేత కె.కేశవరావు, ఎండీఎంకే నేత వైకో తదితరులు ప్రసంగించారు.

ప్రైవేట్‌రంగంలోనూ రిజర్వేషన్లు: రాజా

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ కుల గణనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రైవేట్‌రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మోదీ సర్కారుపై పోరాటానికి విపక్షాలన్నీ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదానీ వంటి పారిశ్రామికవేత్తల కోసమే మోదీ సర్కారు పనిచేస్తోందని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రభుత్వ ఆటలు సాగనివ్వకూడదని విజ్ఞప్తి చేశారు. జెండాలు, అజెండాలు పక్కన పెట్టి బీజేపీని ఓడించడానికి చేతులు కలపాలని విపక్షాలకు సూచించారు.

కొద్దిమంది చేతిలో దేశ సంపద: ఏచూరి

సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు...వారి అవకాశాలను మరింత పెంచడానికి ఓ గొప్ప ముందడుగు అని చెప్పారు. దీనితోపాటు ఆ తరగతులకు ఆర్థికాభివృద్ధి కల్పించాలని సూచించారు. 'ఆర్థికాభివృద్ధి ఏ కొద్దిమందికో పరిమితం కారాదు. గడచిన రెండేళ్లలో జనాభాలో ఒక్కశాతం మంది చేతిలో 40.5 శాతం సంపద పోగుబడింది. కార్పొరేట్, మతతత్వవాదుల మధ్య సంబంధాలపై మనం పోరాటం కొనసాగించాలి' అని ఏచూరి స్పష్టంచేశారు.

ఎన్నికలంటే జగన్‌కు భయం

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వకపోయినా జగన్ మాట్లాడటం లేదన్నారు. రాష్ట్రంపై అప్పులభారం మోపడం తప్ప ఏమి సాధించావని నిలదీశారు. జగన్ సీఎం పీఠం దిగేనాటికి రాష్ట్రానికి 10 లక్షల కోట్ల రూపాయల అప్పు ఉండబోతుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మోదీ, జగన్ ప్రభుత్వాలను సాగనంపేందుకు లౌకికశక్తులతో కలిసి ఉద్యమాలు చేయనున్నట్లు రామకృష్ణ తెలిపారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై మోదీ సర్కారు అనర్హత వేటు వేయడం ద్వారా ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తోందని మండిపడ్డారు. దేశంలో మైనార్టీలు అభద్రతాభావంతో జీవిస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు లేవన్నారు. అదానీ కుంభకోణంపై జేపీసీకి మోదీ సర్కారు ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. మతోన్మాదం, అధిక ధరలు, నిరుద్యోగం, రైతుల అల్పాదాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి నుంచి ఎర్రజెండా నాయకత్వాన బీజేపీ హటావో...దేశ్ బచావో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జంగాల అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు, జిల్లా నాయకులు జేబీ శ్రీధర్ ఉన్నారు.

పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

సెషన్స్ కోర్టుకు హాజరయ్యారు. భారీ భద్రత నడుమ అక్కడకు చేరుకున్నారు. తన జైలుశిక్ష తీర్పును సవాలు చేశారు. ఈ తీర్పుపై అప్పీల్ చేసిన ఆయన మరో రెండు దరఖాస్తులు పెట్టుకున్నారు. ఈ కేసులో తనను దోషిగా తేల్చడంపై స్టే విధించాలని, జైలుశిక్షను సస్పెండ్ చేయాలని కోరారు. అయితే, అవతలి పక్షం వాదనలు వినకుండా అలాంటి ఆదేశాలు ఇవ్వడం వీలుకాదని కోర్టు వెల్లడించింది. పరువునష్టం కేసులో ప్రతివాదులు ఏప్రిల్ 10లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. దీనిపై ఏప్రిల్ 13వ తేదీన విచారణ చేపడతామని స్పష్టం చేసింది. ఇటీవల రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధించడంతో... ప్రజాప్రాతినిధ్య చట్టం కింద ఆయన లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. అంతకుముందు రాహుల్‌కు రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్, ఇతర సీనియర్ నేతలు సూరత్ విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. కోర్టు వెలుపల పెద్దసంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు గుమికూడారు. రాహుల్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. పొరుగు జిల్లాల నుంచి వస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను సరిహద్దుల వద్దే పోలీసులు నిర్బంధించారు. కాగా అప్పీల్ చేసేందుకు వెళ్లిన రాహుల్ వెంట భారీగా పార్టీ శ్రేణులు తరలిరావడాన్ని బీజేపీ తప్పుపట్టింది. రాహుల్ మొదట ఓబీసీ వర్గాన్ని అవమానించారని, ఇప్పుడేమో కుటుంబం, పార్టీ నేతలతో కలిసి డ్రామా చేయడానికి కోర్టుకు వెళ్తున్నారని దుయ్యబట్టింది.

ఐదుగురు మావోయిస్టుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

పాటు భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చత్ర జిల్లా ఎస్పీ రాకేష్ రంజన్ కథనం ప్రకారం... జార్ఖండ్ రాజధాని రాంచీకి 160 కిలోమీటర్ల దూరంలోని చత్ర జిల్లా పాలాము పోలీస్ స్టేషన్ పరిధిలోని లావా లాంగ్ అడవుల్లో సోమవారం ఉదయం మావోయిస్టులు సమావేశమయ్యార న్న పక్కా సమాచారం మేరకు జిల్లా పోలీసులతో పాటు సీఆర్పిఎఫ్, కోబ్రా దళాలు గాలింపు చేపట్టాయి. బలగాల రాకను గమనించిన మావోయిస్టులు కాల్పులు జరపగా... వెంటనే తేరుకున్న భద్రతా బలగాలు ఎదురు కాల్పులు జరిపాయి. కొంతసేపు రెండు వైపుల నుంచి హోరాహోరీగా కాల్పులు జరిగిన అనంతరం సంఘటన స్థలాన్ని పరిశీలించగా ఐదుగురు మావోయిస్టుల మృత దేహాలు లభ్యమయ్యాయి. రెండు ఏకే 47 గన్స్, మూడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో జార్ఖండ్ మావోయిస్టు పార్టీ సెక్రటరీ అరుణతో పాటు అగ్ర నేతలు గౌతమ్ పాశ్వాన్, చార్లెస్ మృతి చెందినట్లు తెలిసింది. వీరిద్దరిపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. మిగతా ముగ్గరి పై రూ.ఐదు లక్షల రివార్డు ఉంది. ఈ సంఘటనలో మరి కొంతమంది మావోయిస్టులకు గాయాలు అయి ఉండవచ్చునని ఎస్పీ తెలిపారు. వీరి కోసం మావోయిస్టుల కోసం అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేసి వాహనాల తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇదిలా ఉండగా ఆదివారం చత్తీస్‌గఢ్ రాష్ట్రం కంకేరు జిల్లా లో ముగ్గురు మావోయిస్టులు సుమన్ట్ అలియాస్ సుమన్ సింగ్ (42), సంజయ్ కుమార్ ఉసెండి (27), పరాక్రమ్ దంగుల్ (55) లొంగిపోయారని ఎస్పీ కోమన్ సిన్హా తెలిపారు.

25 మంది అవుట్?

(మొదటిపేజీ తరువాయి)

మార్చి రెట్టింపు ఉత్సాహం, వేగంతో పనిచేయాలని సీఎం జగన్ ఆదేశించారు. రాష్ట్ర చరిత్రలోనే కాదు...దేశ చరిత్రలోనే నాలుగేళ్ళు గడవకముందే రూ.2లక్షల కోట్లకు పైగా డబ్బులను వివక్ష, లంచాలకు తావులేకుండా అక్కచెల్లెమ్మల ఖాతాలకు సంక్షేమం అందజేశామన్నారు. పట్టణప్రాంతంలో 84శాతం, గ్రామీణంలో 92 శాతం...సగటున 87 శాతం కుటుంబాలకు మంచి చేశామని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గొప్పగా గెలిచామంటూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని, 21 స్థానాలకుగాను 17 స్థానాల్లో వైసీపీ గెలిచిందని స్పష్టం చేశారు. ఒక్కో ఎమ్మెల్యేను టార్గెట్ చేస్తూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్నాయని, పార్టీ కార్యకర్తలు అత్యంత క్రియాశీలకంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

పది ప్రశ్నపత్రం లీక్!

నలుగురిపై వేటు

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇప్పటికే టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీతో తలవంపులు తెచ్చుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి మరో షాక్ తగిలింది. సోమవారం తెలంగాణ వ్యాప్తంగా ప్రారంభమైన పదో తరగతి తెలుగు ప్రశ్నపత్రం లీకవడం కలకలం రేపింది. పరీక్ష ప్రారంభమైన ఏడు నిమిషాల్లోనే ప్రశ్నపత్రం వాట్సాప్‌లలో వైరల్ అయింది. ఉదయం 9:30 గంటలకు పది పరీక్షలు మొదలవగా 9:37 గంటలకే ప్రశ్నపత్రం లీక్ అయ్యింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరులో చోటు చేసుకుంది. ఎంతో పకడ్బందీగా నిర్వహించవలసిన పదో తరగతి వార్షిక పరీక్షల పేపర్ తాండూరు వాట్సాప్ సోషల్ మీడియాల గ్రూప్‌లలో ముందే చక్కర్లుకొట్టింది. తాండూర్‌లోని ఓ సెంటర్‌లో ప్రశ్నాపత్రం లీకైనట్లు సమాచారం. ఈ విషయంపై అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పేపర్ మనది కాదంటూ బుకాయించారు. అయితే పరీక్ష అయిపోయిన తర్వాత 12:30 గంటలకు బయటకు వచ్చిన విద్యార్థుల దగ్గర పేపర్ చూడగా ఆ పేపర్ ఈ పేపర్ ఒకే విధంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో ముందుగానే పదో తరగతి పరీక్ష పేపర్ లీక్ అయిందని తేలింది. ప్రశ్నపత్రం లీకేజీతో టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రశ్నపత్రం లీకేజ్‌పై వికారాబాద్ డీఈవో వివరణ ఇచ్చారు. తమ జిల్లాలో ఎలాంటి ప్రశ్నపత్రం లీక్ అవలేదని చెప్పారు. సెల్‌ఫోన్‌ను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించడంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్ష పత్రం లీకేజ్‌పై నివేదిక ఇవ్వాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డికి ఆదేశాలు జారీ చేసింది. కాగా పేపర్ లీక్ ఘటనలో నలుగురి పై సస్పెన్షన్ వేటు పడింది. సస్పెండ్ అయిన వారిలో నంబర్ 1 సెంటర్ కు చెందిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌తోపాటు ఇద్దరు ఇన్విజిలేటర్లు ఉన్నారు.

నేటి పరీక్ష యథాతథం

తల్లిదండ్రులు, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, మంగళవారం నాటి పరీక్ష యథాతథంగా నిర్వహిస్తామని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పేర్కొన్నారు. పేపర్‌ను వాట్సాప్ గ్రూప్‌లో లీక్ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బందప్పను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై గతంలోనూ ఆరోపణలు వచ్చాయి. 2017లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. పాఠశాల గదిలో ఒక విద్యార్థినిని వేధించడంతో కేసు నమోదు చేశారు. బందప్ప భార్య అదే పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు.

బోర్డు కార్యాలయం ముట్టడి

మరోవైపు 10వ తరగతి ప్రశ్నపత్రం లీకేజీపై ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎస్ఎస్‌సి బోర్డు కార్యాలయాన్ని ముట్టడించారు.ఒక్కసారిగా విద్యార్థి సంఘాల నేతలు బోర్డు కార్యాలయం వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయం బోర్డు, గేట్లను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. 10వ తరగతి పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజి పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వరుస లీకేజీలో అటు ఉద్యోగార్థులు, ఇటు విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారని సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేసి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

కార్మిక సంక్షేమ బోర్డు నిధులు
ప్రచార ఆర్భాటానికా?

- పెండింగ్ క్లెయిమ్స్ తక్షణమే విడుదల చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హరినాథరెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: పక్కదారి పట్టించిన సంక్షేమ బోర్డు నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని, 2018 నుంచి పెండింగ్ లో ఉన్న క్లెయిమ్‌ల మొత్తాన్ని విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హరినాథరెడ్డి మాట్లాడుతూ... కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ఫలితంగా తీసుకొచ్చిన భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును సక్రమంగా నడపకుండా పాలకులు నిర్లక్ష్యం చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. సంక్షేమ బోర్డు నిధులు ఆ సంఘ కార్మిక సంక్షేమ ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సింది పోయి ప్రభుత్వ ప్రచార ఆర్భాట కార్యక్రమాలకు ఉపయోగిస్తూ సంక్షేమ బోర్డుకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెస్ రూపంలో వసూలైన డబ్బే కాకుండా ఇసుకను సైతం అమ్ముకుంటూ కోట్లాది రూపాయలు గడిస్తూ కార్మికుల సంక్షేమాన్ని పక్కన పెడుతున్నాడని మండిపడ్డారు. 2018 నుంచి నేటి వరకు విడుదల చేయాల్సిన క్లెయిములను ఎందుకు పెండింగ్‌లో పెడుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. సంక్షేమ బోర్డు నిధులను ఇష్టాను సారంగా వాడుకోవడానికి జీవో నంబర్ 17 తీసుకొని వచ్చి ఆ నిధులన్నీ దారి మళ్లిస్తున్నారని, ఇది అత్యంత అప్రజాస్వామిక, చట్ట విరుద్ధమైన చర్యగా ఆయన అభివర్ణించారు. తక్షణం ప్రభుత్వం ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధాకృష్ణ మాట్లాడుతూ... తిరుపతి జిల్లాలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు సొంత ఇళ్లు లేక బాడుగలు కట్టుకోలేక చేతినిండా పని లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీరందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తే ఏఐటీయూసీ చూస్తూ ఊరుకోదని తక్షణమే భవన నిర్మాణ కార్మిక సంఘ సంక్షేమ బోర్డును సక్రమంగా నిర్వహించాలని లేకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీ మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీరాములు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్‌డీ రవి, కేవై రాజా, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి బి.నదియా, చంద్రశేఖర్ రెడ్డి, శివ, సీహెచ్ శివ శ్రీనివాసులు, రవి, కోటి, కార్తీక్, వరుణ్, దుర్గారావు, వీరయ్య, మురళి, కొండయ్య, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేని సీతారామ్ లా అడ్మిషన్‌పై
విచారణ జరిపించాలి

తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్‌కు డిగ్రీ లేకుండా మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సులో ఎలా అడ్మిషన్ ఇచ్చారో విచారణ జరపాలని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ జరిపి సూత్రధారులు, పాత్రదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులతి దీనిపై సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం 2019లో స్పీకర్ అయిన తరువాత ఉన్నత చదువు కోసం ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎల్.బి.నగర్‌లోని మహాత్మాగాంధీ లా కాలేజీలో ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు చదవటానికి అడ్మిషన్ పొందారు. అకడమిక్ ఇయర్ 2019-20 హాల్ టికెట్ నెంబర్ 1724 1988 1298. ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు చదవాలంటే కచ్చితంగా డిగ్రీ పాసై ఉండాలి. లేదా డిగ్రీకి సమానమైన అర్హత కలిగిన కోర్సు పూర్తి చేసినవారు మాత్రమే ఎల్ఎల్‌బీ 3 సంవత్సరాల కోర్సు పూర్తి చేయడానికి అర్హులు. డిగ్రీ చదువు మధ్యలోనే వదిలేసిన తమ్మినేని సీతారాం ఎల్ఎల్‌బీ కోర్సులో ఎలా అడ్మిషన్ పొందారు? ఇందుకు సహకరించిన ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు ఎవరు? వారిపై చర్యలు తీసుకోవాలని, మహాత్మాగాంధీ లా కాలేజిలో జరిగే అక్రమాలపై విచారణ జరిపించాలని ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. తమ్మినేని సీతారామ్ ఐ డ్రీమ్స్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో "కోటబొమ్మాలిలో ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, టెక్కలిలో స్కూల్ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియట్ శ్రీకాకుళం, డిగ్రీ నేను అసంపూర్తిగా విడిచి పెట్టేశాను" అని స్వయంగా పేర్కొన్నారని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు.

పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి

వ్యవసాయశాఖ మంత్రికి కేవీవీ ప్రసాద్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అకాల వర్షాలు, వడగళ్ల వాన, ఈదురు గాలులతో పంటలు కోల్పోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి లేఖ రాశారు. 10 రోజుల నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఈదురు గాలులతో అకాల వర్షాలు సంభవించి వివిధ రకాల పంటలను తీవ్రంగా దెబ్బతీశాయని తెలిపారు. మామిడి, అరటి, మొక్కజొన్న, వరి, మిర్చి, మినుము, పెసర లాంటి ఆహార, ఉద్యాన, వాణిజ్య పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని, దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వివరించారు. సాధారణంగా అకాల వర్షాలు మే, జూన్‌లో పడతాయి... ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్ర వ్యాప్తంగా మార్చిలో కురిశాయని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్య ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతని, వెంటనే పంట నష్టాన్ని సక్రమంగా అంచనా వేసి, రైతులకు పరిహారం అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 2వ తేదీన ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంత సమీప గ్రామాలలోని మామిడి తోటలను తనతో పాటు రైతుసంఘ నాయకులు పి.జమలయ్య, చలసాని రామారావు, బత్తుల వెంకటేశ్వర రావు, రాయంకుల లక్ష్మణరావు, చాట్ల పుల్లారావు, చలసాని నరేంద్రతో కూడిన బృందం పరిశీలించిందని తెలిపారు. అదే విధంగా వివిధ జిల్లాల్లో ఆయా జిల్లాల రైతుసంఘ నాయకులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారన్నారు. ఈ ఏడాది మామిడి తోటలపై తామరపురుగు అధికంగా సోకిందని, రాతిమంగు, నల్లమంగు తెగుళ్లు సోకాయని, వర్షాలవల్ల మంగుతెగులుతో కాయలు రంగు మారిపోయాయని వివరించారు. గాలులకు మామిడి కాయలు పెద్దఎత్తున రాలిపోగా ఆ కాయలను తోటల నుంచి ఏరి పారబోయడం సమస్యగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. కాయలపై నల్లమంగు, రాతిమంగు వల్ల వచ్చిన నల్లమచ్చలతో...కాయకు మార్కెట్లో నామమాత్రపు ధర కూడా వచ్చే అవకాశం లేదని రైతులు తెలిపారన్నారు. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలవల్ల దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, ఉద్యానపంటలకు పంటల బీమా వర్తింపజేయాలని, పెరిగిన వ్యవసాయ ఖర్చులకు అనుగుణంగా పంటల నష్టపరిహారాన్ని పెంచే యోచన చేయాలని ఆ లేఖలో కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు...
పశువులకు ప్రాణ సంకటం

విశాలాంధ్ర-చింతపల్లి: ప్లాస్టిక్ వ్యర్థాలు పశువులకు ప్రాణ సంకటంగా తయారయ్యాయి. పంట చేలు, పొలాల్లోకి వెళ్లి పచ్చిక తినవలసిన పశువులు... అక్కడ పచ్చిక లేని కారణంగా గ్రామాల్లోని ప్రధాన రహదారులలో తిరుగుతూ చెడిపోయిన కూరగాయలు, కాగితాలు, గోడ పత్రికలు తింటూ కడుపు నింపుకుంటున్నాయి. ప్రతి చోట ప్లాస్టిక్ వ్యర్థాలు అధికం కావడం, శుభకార్యాలలోనూ ప్లాస్టిక్ తో తయారైన ప్లేట్లు ఎక్కువగా వాడుతుండటంతో వాటికి అంటుకున్న ఆహారం కోసం పశువులు ఏకంగా ఆ ప్లేట్లను నమిలి మింగేస్తున్నాయి. అదేవిధంగా గోడ పత్రికలను వదలడం లేదు. నీచ పదార్థాలను తినని గోవులు సైతం కల్యాణమండపాలు, హోటళ్లు, కూరగాయలు అమ్మే ప్రాంతాలలోనూ తిరుగుతూ పొట్ట పోసుకుంటున్నాయి. అయితే ప్లాస్టిక్ వ్యర్థాలు తిన్న పశువులు వ్యాధులకు గురై, శ్వాస సంబంధిత వ్యాధులు తలెత్తి మృత్యువాత పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ నియంత్రించాలని సంకల్పించినప్పటికీ మన్యం ప్రాంతంలో వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించే నాథుడే కరువయ్యారు. మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తూతూ మంత్రంగా ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేస్తున్నట్లు ప్రకటించుకుంటున్నప్పటికీ మన్యంలోని వారపు సంతలలో, హోటళ్లు, కూరగాయలు, పండ్లు, కిరాణా దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. కట్టలకొద్దీ అమ్ముతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా రైతులు కోరుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర-నంద్యాల: మోదీ, జగన్ ప్రభుత్వాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు పోరాటం కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు చెప్పారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకన్న, పట్టణ కార్యదర్శి ప్రసాద్‌తో కలిసి ముప్పాళ్ల సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బాధ్యతయుత ప్రతిపక్ష పార్టీగా సీపీఐ పోరాడుతోందని ముప్పాళ్ల తెలిపారు. 2014 ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. మోదీ హయాంలో 410 రూపాయల గ్యాస్ సిలిండర్ ధర రూ.1200కు పెరిగిందని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరలకు అంతేలేదన్నారు. రాహుల్‌గాంధీ ఎంపీ పదవిని తొలగించడం ద్వారా మోదీ హిట్లర్, నాజీలను మించి నియంతృత్వ ధోరణికి పాల్పడ్డారని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెడుతున్నారని చెప్పారు. జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల 14వ తేదీ నుండి దేశవ్యాప్త ప్రచారాందోళనలు నిర్వహిస్తామన్నారు. 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్న సీఎం జగన్...31 మంది ఎంపీలు ఉన్నా ఎందుకు సాధించలేదని నిలదీశారు. కేంద్రం వద్ద అప్పులు తెచ్చుకునేందుకే ఆయనకు సమయం చాలడం లేదన్నారు. మద్యపాన నిషేధం హామీని తుంగలో తొక్కి...మద్యంపై ఆదాయాన్ని రూ.23,800 కోట్లకు పెంచుకున్నారని ఆరోపించారు. రామాంజనేయులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయించాలని, సిద్దేశ్వరం అలుగును నిర్మించాలని, హంద్రీ నీవా ద్వారా చెరువులు నింపాలని డిమాండ్ చేశారు.

పాదయాత్ర జయప్రదం చేయండి

జేవీ సత్యనారాయణమూర్తి పిలుపు

విశాలాంధ్ర-సీలేరు: పాలకుల విధానాలను నిరసిస్తూ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లాలో సీలేరు వర్తక సంఘం భవన్‌లో సోమవారం జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా హజరైన ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి నుంచి గ్రామాలలో ఉండే సమస్యలపై పాదయాత్ర చేయాలన్న భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి నిర్ణయం మేరకు ఈ పాదయాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గల ముంపు మండలాలకు ఇవ్వవలసిన నష్టపరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతర్ రాష్ట్ర రహదారి మధ్యలో ఆర్వీనగర్ నుంచి సీలేరు వరకు రహదారి శిథిలమై ఉన్నా పట్టించుకోవడం లేదని, ఆ రహదారి వేయాలని కోరారు. స్థానిక సమస్యలను జిల్లా కార్యవర్గ సభ్యులు గుర్తించి వాటి పరిష్కారానికి పాదయాత్ర నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ, కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి, మొట్టడం రాజబాబు, పేట్ల పోతురాజు, ఇరవాడ దేవుడు, సింహాచలం, సమితి సభ్యులు సెగ్గె కొండలరావు, కంకిపాటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల విధానాలపై సమరశీలపోరు

- ఈశ్వరయ్య పిలుపు
- సీఐటీయూ నుంచి 40 మంది ఏఐటీయూసీలో చేరిక

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, హెల్పర్లు 40 మంది సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలో చేరారు. కార్యకర్తలు, కె.నిర్మల, పి.రాజమ్మ, ఎన్.శోభ, ఆర్.మహేశ్వరి, వై. లీలావతి, శంకరమ్మ, కౌసల్య, సుబ్బరత్న, సుభాషిని, పెంచలమ్మ, మునీఇంద్ర, హేమలత, రాజమ్మ, అమరావతి, మస్తానీ, విమల, అరుణ, విజయమ్మ, హెల్పర్లు గౌసియా, సుక్కమ్మ, ప్రసన్నకుమారి, లీలావతి, సుజాత, జయమ్మ, సునీత, ఈశమ్మ, నాగమణి, సుభాషిని, లక్ష్మీదేవి, భారతి, ఈశ్వరమ్మ, దివ్య, గంగాదేవి, లక్ష్మమ్మలకు ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ ,హెల్పర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా కో కన్వీనర్ నంద్యాల సరోజమ్మ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఏఐటియుసి కార్యాలయంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య ఏఐటీయూసీ కండువా వేసి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమన్నారు. యూనియన్‌లు బలపడడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భయం ఏర్పడిందన్నారు. మానవ వనరులను దోచుకోవడానికి కావాల్సిన చట్టాలు విచ్చలవిడిగా రూపొందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల ప్రజల జీవితాలు అతలాకుతలమవుతున్నాయన్నారు. ప్రపంచీకరణ ప్రైవేటీకరణ సరళీకరణ పేరుతో దోచుకుంటున్నారన్నారు. పాలకులు అనుసరిస్తున్న ఈ దుర్మార్గపు విధానాలు తిప్పికొట్టి కార్మికవర్గాన్ని కాపాడుకోవాలన్నారు. కార్మికవర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు విశ్వనాథ నాయక్, సీపీఐ అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సిపిఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, ఏపీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ పోకూరు మురళి, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి గంగాధర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, సహాయ కార్యదర్శి గంగాపూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడిపై దాడి...
సజీవ దహనం

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: అల్లూరి జిల్లా దుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ వయ్యా గ్రామంలో కొందరు దుండగులు ఘాతుకానికి పాల్పడ్డారు. చెట్టు కింద సేద తీరుతున్న గిరిజనుడిపై దాడి చేసి పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన దారుణ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వయ్యా గ్రామంలోని గొల్లోరి గోవింద్(42) అనే గిరిజనుడు సోమవారం ఆ గ్రామానికి సమీపంలోని పొలాల్లో పశువులు కాస్తూ... మధ్యాహ్నం చెట్టు కింద నీడలో పడుకుని సేద తీరుతుండగా కొంతమంది అతడిపై దాడి చేసి అప్పటికప్పుడు పెట్రోల్ పోసి సజీవ దహనం చేసినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ జీడి బాబు, ఎస్ఐ సంతోష్ కుమార్ ఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ ఘటనకు కుటుంబ తగాదాలా లేక భూతగాదాలు కారణమా అనేది పోలీసుల దర్యాప్తు లో తెలియాల్సి ఉంది. గోవింద్‌కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని హత్యకు గురవడంతో భార్య, పిల్లలు బోరున విలపిస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. పట్టపగలు ఈ సంఘటన జరగడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

పాలకుల విధానాలపై చైతన్య కార్యక్రమాలు

డేగా ప్రభాకర్ వెల్లడి

విశాలాంధ్ర - అమలాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ తెలిపారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రాజకీయాలలో ప్రమాదకర ధోరణి కనిపిస్తున్నదని. మోదీ ప్రభుత్వం దేశ సంపదను ఆదానికి దోచిపెడుతోందని విమర్శించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన 26 జిల్లాలకు ఉపయోగపడే బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 14 నుంచి 30వరకు ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని. ప్రజల కోసం చేస్తున్న పోరాటంలో ప్రజలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు, అమలాపురం నియోజకవర్గ కార్యదర్శి ఆడపా సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు మోకా శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊటాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ పోస్ట్‌కార్డు ఉద్యమం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సామాన్య ప్రజలపై పన్నుల భారమేస్తూ, దేశ సంపదలను ఆదానీకి దోచిపెడుతున్న ప్రధాని మోదీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ పోస్టు కార్డుల ఉద్యమాన్ని సోమవారం చేపట్టింది. విజయవాడ ఎస్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల వద్ద యువతీ యువకులుప్రధాని మోదీని హెచ్చరిస్తూ నిర్వహించిన ఈ ఉద్యమాన్ని ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మెయ్యప్పన్, కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ కార్యదర్శి జేడీ శీలం ప్రారంభించారు. గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ దేశ సంపదను ఆదానీకి దోచిపెడుతున్న మోదీ దేశ ప్రజలకు సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ, వి.గురునాథం, పీటర్ జోసఫ్, పవన్ తేజ, శ్రీనివాస సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నరు దృష్టికి పీహెచ్‌డీ సమస్య తీసుకెళ్తాం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్‌సెట్, నెట్‌లో అర్హత సాధించిన పీహెచ్‌డి విద్యార్థులకు విశ్వవిద్యాలయాల్లో సీట్ల కేటాయింపుపై గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నిబం ధనల ప్రకారం మూడేళ్ల పదవీకాలం ఉన్న ప్రొఫెసర్లను పీహెచ్‌డీ విద్యార్థులకు గైడులుగా నియమించాలని చెబుతున్న ప్పటికీ ఉన్నత విద్యా మండలి అధికారులు, వైస్ ఛాన్సలర్లు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. చాలా ఏళ్లు కష్టపడి నెట్‌లో అర్హత సాధించిన పేద విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతోందని, పరిశోధనలకు నిలయాలుగా ఉన్న విశ్వవిద్యాలయాలలో గైడ్స్ రిటైర్ అయితే పీహెచ్‌డీ విద్యార్థులు ఎక్కడికి వెళ్లి పరిశోధనలు చేయాలని అధికారులను ప్రశ్నించారు. గైడ్లు ఆరు నెలలకు ఒకరు మారుతూ ఉంటే పరిశోధనలు చేయడానికి పీహెచ్‌డీ విద్యార్థుల దగ్గర సరిపడా డబ్బులు లేక మధ్యలోనే పరిశోధనలు ఆగిపోయే ప్రమాదం ఉంటుం దన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యాశాఖ, యూనివర్సిటీ వైస్ ఛాన్సర్లు, పీహెచ్‌డీ స్కాలర్లకు మూడేళ్ల కాల పరిమితి ఉన్న ప్రొఫెసర్లనే గైడులుగా నియమించాలని, లేకుంటే పీహెచ్‌డీ విద్యార్థులను సమీకరించి రాజభవన్‌ను ముట్టడిస్తామని శివారెడ్డి హెచ్చరించారు.

వైసీపీ హయాంలో డ్వాక్రాసంఘాల నిర్వీర్యం

టీడీపీ నేతల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గతంలో దేశానికే ఆదర్శంగా నిలిపిన డ్వాక్రా సంఘాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని టీడీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం తెలుగునాడు అంగన్వాడీ-డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డ్వాక్రా మహిళలకు చంద్రబాబు అందించిన ఆర్థిక చేయూత, జగన్ రెడ్డి డ్వాక్రాను నిర్వీర్యం చేస్తున్న తీరు, ఆసరా పేరుతో చేస్తున్న మోసం వంటి వివిధ అంశాలపై నేతలు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆసరా కాదు డ్వాక్రాకు టోకరా-డ్వాక్రా అభివృద్ధి చంద్రన్నతోనే సాధ్యం అన్న పేరుతో బ్రోచర్ విడుదల చేశారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్, టీడీపీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, హెచ్ ఆర్ డీ చైర్మన్ రామాంజనేయులు, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి శ్రీదేవి చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే జగన్ అరాచక పాలన అంతం తప్పదన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు సంక్షేమానికి పెద్దపీట వేయగా, జగన్ రెడ్డి సంక్షేమం మాటున ప్రజాధనం లూటీ చేస్తున్నారని విమర్శించారు. జగన్ రెడ్డిది మోసకారి సంక్షేమమని, ఆ పేరుతో చేస్తున్న లూటీని క్షేత్రస్థాయిలో ప్రజలకు అర్థమయ్యేలా చైతన్యం చేయాలని వారు సూచించారు. మహిళా శక్తి తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు. టీడీపీ మహిళా సైన్యం ఒక్క తాటిపై నడుస్తూ జగన్ రెడ్డి చేస్తున్న మోసాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

సంపాదకీయం

రాహుల్‌కు ఊరట

దొంగలందరికీ మోదీ అన్న ఇంటి పేరు ఎందుకుంటుంది అని 2019లో ఒక ఎన్నికల ప్రచార సభలో అన్నందుకు సూరత్‌లోని ఓ కింది కోర్టు రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించిన కేసులో సోమవారం బెయిలు లభించింది. సూరత్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల శిక్ష విధించిన 24 గంటల్లోనే ఆఘమేఘాల మీద ఆయన లోకసభ సభ్యత్వం కూడా రద్దయిపోయింది. లోకసభ సభ్యుడిగా ఆయనకు కేటాయించిన ఇల్లు కూడా ఖాళీ చేయాలని ఆదేశించడమూ వెంటనే జరిగిపోయింది. రాహుల్‌కు సెషన్స్ కోర్టు బెయిలు అయితే మంజూరు చేసింది. అది దాదాపు నెలరోజుల కోసమే. అంతకు ముందే రాహుల్ కు విధించిన రెండేళ్ల జైలుశిక్ష నెలరోజులపాటు అమలు చేయకూడదని శిక్ష విధించిన చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ చెప్పారు. ఈ తీర్పు తరవాత 11 రోజులకు రాహుల్‌కు బెయిల్ మంజూరైంది. ఈ కేసులో తదుపరి విచారణ ఏప్రిల్ 13వ తేదీన జరుగుతుంది. అప్పుడు రాహుల్ స్వయంగా కోర్టుకు హాజరు కానక్కరలేదు. అయితే ఇప్పుడు బెయిలు దొరికింది కనక రాహుల్ గాంధీ లోకసభ సభ్యత్వం కూడా పునరుద్ధరిస్తారని చెప్పడానికి వీలు లేదు. ఇటీవలే లక్షద్వీప్ నుంచి ఎన్నికైన నేషనలిస్టు కాంగ్రెస్‌పార్టీ లోకసభ సభ్యుడు మహమ్మద్ ఫైజల్‌కు కూడా ఇలాగే బెయిలు మంజూరు అయింది. అయితే ఆయన లోకసభ సభ్యత్వం మాత్రం వెంటనే పునరుద్ధరించలేదు. నెల రోజులు జాప్యం చేశారు. రాహుల్ గాంధీకి బెయిలు మంజూరు కావడంలో పెద్ద విశేషం ఏమీ లేదు. బెయిలు మంజూరు అయిన వెంటనే "నేను సత్యం కోసం పోరాడతాను" అన్న మహాత్మా గాంధీ సూక్తిని రాహుల్ ట్విట్టర్ లో పునరుద్ఘాటించారు. శిక్ష పడ్డప్పుడు కూడా ఆయన ఇదే పని చేశారు. సత్యం కోసం పోరాడడమే కాదు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆశ్రిత పక్షపాత విధానాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తూనే ఉంటానని కూడా చెప్పారు. రాహుల్ గాంధీ సెషన్స్ కోర్టులో బెయిలుకోసం అర్జీ పెట్టుకోవడానికి వెళ్లినప్పుడు ఆయనతో పాటు ప్రియాంకా గాంధీ కూడా ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేల్ భగేల్, హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్‌తో పాటు అనేకమంది కాంగ్రెస్ నాయకులు కూడా సూరత్ వెళ్లారు. సూరత్‌లో కాంగ్రెస్ కార్యకర్తల హడావుడి చాలా ఎక్కువగా కనిపించింది. ఆ పట్టణంలో అనేక చోట్ల "రాహుల్ భయపడొద్దు", "సత్యమేవ జయతే" లాంటి బ్యానర్లు, పోస్టర్లు కనిపించాయి. వందలు, వేల సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు కోర్టు ఆవరణ దగ్గరకు వచ్చారు. రాహుల్‌తో పాటు తామూ కోర్టులోకి వెళ్లడానికి ప్రయత్నించారు. ఇవన్నీ రాజకీయ బల ప్రదర్శనకు ఉద్దేశించిన కార్యక్రమాల్లో భాగం అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కానీ గుజరాత్ ప్రభుత్వం రాహుల్ కు మద్దతు తెలియజేయడానికి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను భారీ సంఖ్యలో అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడానికి తమ చేతిలో ప్రభుత్వాధికారం ఉందని నిరూపించుకుంది.

రాహుల్‌కు శిక్ష విధించినప్పుడు న్యాయస్థానం తీర్పును రాజకీయ దుష్ప్రచారానికి వినియోగించుకున్నట్టే బీజేపీ ఆయన బెయిలు కోసం వెళ్లడాన్ని కూడా రాజకీయ దృక్కోణం నుంచే చూసింది. బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా, కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు దగ్గరనుంచి మొదలుపెట్టి అనేకమంది బీజేపీ నాయకులు రాహుల్‌ను ఎద్దేవా చేయడానికి తమ ట్విట్టర్ ప్రతిభనంతా కనబరిచారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు అయితే "బెయిలు తెచ్చుకోవడానికి రాహుల్ మందీ మార్బలంతో స్వయంగా సూరత్ వెళ్లనక్కర్లేదు. బెయిలుకోసం దోషిగా తేలిన వ్యక్తి స్వయంగా వెళ్లనక్కర్లేదు. సాధారణంగా దోషిగా తేలిన వారెవరూ స్వయంగా వెళ్లరు. మందీ మార్బలాన్ని వెంటేసుకుని రాహుల్ సూరత్‌కు వెళ్లడం ఓ నాటకం" అన్నారు. అప్పీలుకు వెళ్లిన కోర్టు మీద ఒత్తిడి తీసుకు రావడానికే రాహుల్ జనాన్ని వెంటేసుకు వెళ్లారు. ఇది పిల్ల చేష్ట. కాని ఈ దేశంలో కోర్టులు ఇలాంటి ఎత్తుగడలకు లొంగిపోవు" అని రిజిజు కసిగా వ్యాఖ్యానించారు. ఆయనతో పోటీపడి బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా "రాహుల్ దొంగలందరికీ మోదీ అన్న ఇంటిపేరు ఎందుకు ఉంటుంది" అనడాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ 2019లో చేసిన వ్యాఖ్యలు వెనుకబడిన తరగతుల వారిని కించపరచడమేనన్న కుతర్కాన్ని ప్రదర్శించారు. రాహుల్ చేసిన వ్యాఖ్యల్లో లలిత్ మోదీ, నీరవ్ మోదీతో పాటు నరేంద్ర మోదీ పేరు కూడా ఉంది. ఇందులో నరేంద్ర మోదీ తప్ప మిగతా ఇద్దరు వెనుకబడిన తరగతుల వారు కాదు.

కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్న బీజేపీ ప్రణాళికలో భాగంగానే రాహుల్‌ను "పప్పు" లాంటి మాటలతో గేలి చేయడానికి బీజేపీ సకల ప్రయత్నాలూ చేసింది. ఇంతకు ముందు రాహుల్ గాంధీ రాజకీయాలలో అంత సీరియస్‌గా ఉండేవారు కాదు. ఆయన మాటలు కూడా యథాలాపంగా ఉండేవి. కానీ ఇటీవలి కాలంలో రాహుల్‌లో పరిపక్వత స్పష్టంగా కనిపిస్తోంది. భారత్ జోడో యాత్ర తరవాత ఆయన వ్యక్తిత్వంలో మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ యాత్ర జనంలో కాంగ్రెస్‌పై ఆదరణ పెంచించి. ఇది బీజేపీకి మింగుడు పడకపోవడమే కాదు 2024లో సార్వత్రిక ఎన్నికలు జరిగే సమయానికి రాహుల్ పలుకుబడి మరింత పెరిగితే తమ గతేమిటి అన్న బాధ బీజేపీని కుంగదీస్తోంది. ఎక్కడో కర్నాటకలోని కోలార్‌లో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై గుజరాత్‌లోని సూరత్ కోర్టులో పరువు నష్టం దావా వేయడం, ఆ దావా వేసిన వ్యక్తి పూర్ణేశ్ మోదీ మధ్యలో తానే విచారణపై స్టే విధించాలని కోరడం, మళ్లీ లోకసభలో రాహుల్ ప్రభుత్వాన్ని కడిగేసిన తరవాత విచారణ మళ్లీ చేపట్టాలని కోరడం, అమితవేగంగా విచారణ పూర్తి అయి శిక్షపడడం మొదలైన పరిణామాల వెనక రాజకీయాలు లేవంటే నమ్మలేం.

న్యాయస్థానాలను కూడా తమ రాజకీయాలకు వాడుకోవడం బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాతే పెరిగిపోయింది. రాజకీయ విమర్శల ఆధారంగా కోర్టుల్లో పరువునష్టం దావాలు వేయించి ప్రత్యర్థులను కట్టడి చేయాలనుకోవడం కుటిల రాజకీయాల్లో భాగమే. మరో వేపు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ మోదీ డిగ్రీ నకిలీదని రుజువు చేయడానికి ప్రయత్నించారు. రాహుల్ కేసుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికి మోదీ డిగ్రీ అసలుదో నకిలీదో తేల్చడానికి విచారణకు ఆదేశిస్తే మోదీ లోకసభ సభ్యత్వానికి కూడా ప్రమాదం ఏర్పడుతుంది.

గాంధీని అవమానించిన గవర్నరు!

అరుణ్ శ్రీవాత్సవ



స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన మహాత్మాగాంధీని కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అవమానించి తన అజ్ఞానాన్ని బైటపెట్టుకున్నారు. గాంధీకి లా డిగ్రీ కూడా లేదని ఎగతాళి చేశారు. ఆయన ఇట్లా మాట్లాడటంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఎందుకంటే కాషాయదళాలకు గాంధీపై ఏ మాత్రం గౌరవం లేదని ఆయన చెప్పిన అంశాలను కూడా ఖాతరు చేయరు. స్వాతంత్ర్యపోరాట చరిత్రలేని కాషాయదళాలకు ఇంతకంటే ఎక్కువ జ్ఞానం ఉంటుందని భావించడం కూడా కష్టమే. గాంధీకి యూనివర్సిటీ డిగ్రీ ఒక్కటికూడా లేదని సిన్హా వ్యాఖ్యానించి ఏమాత్రం విద్య, విజ్ఞానం కూడా లేదని నిరూపించుకున్నాడు. సిన్హాకు విద్య, దివాళాకోరుతనం అసాధారణమైన విషయం ఏమీకాదు. సరిహద్దుల్లో కీలకమైన రాష్ట్రం కశ్మీరు. ఇంతటి ప్రాముఖ్యతగల రాష్ట్ర గవర్నర్‌కు గాంధీని గురించి ఏమాత్రం తెలియదని ఎవరూ భావించరు. జమ్ము-కశ్మీర్‌లో విద్య, సాంస్కృతిక రంగాలను అభివృద్ధి పరచేందుకు సిన్హాను ఆ రాష్ట్రానికి పంపారు. మరిఎందుకు ఇలా నిరక్షరాస్యుడిగా వ్యాఖ్యానం చేశారన్నది ఆయనకే తెలియాలి. కనీసం గాంధీ స్వీయచరిత్ర "మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ది ట్రూత్" అనే పుస్తకం కూడా ఆయన చదవలేదని అర్థమవుతోంది. ఈ పుస్తకంలో తన గురించి గాంధీ పూర్తి వివరాలను పేర్కొన్నారు. తనలో ఉండే లోపాలను, బలహీనతలనుసైతం బహిరంగంగానే వెల్లడించారు. కాషాయదళాల నాయకుడులాగా నటించడం, కపటం గాంధీకి తెలియదు. ఇలాంటి వారు బీజేపీలో అనేకమంది ఉన్నారు. మంచి ఉదాహరణగా నరేంద్ర మోదీని కూడా చెప్పుకోవచ్చు.



కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా

బీజేపీ లోక్‌సభ సభ్యుడు ఒకరు ఇలాగే మాట్లాడుతుంటారు. అందువల్ల అతని వ్యవహారాన్ని కూడా ప్రజలముందు ఉంచేందుకు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రి గట్టి పోరాటమే చేశారు. గతంలో మోదీకి అత్యంత ప్రియమైన నాయకుల్లో ఇరానీ కూడా తన విద్యార్హతలను చెప్పేందుకు తిరస్కరించి వార్తలకెక్కారు. తాము చెప్పేవి 100శాతం తప్పు అని తెలిసినప్పటికీ బీజేపీ నాయకులు తమదే రైటని వాదించడానికి ఏమాత్రం వెనుకాడరు. తప్పులను కూడా ఒప్పులుగా చెప్పుకునేవారిని నిజంగా ప్రశంసించాల్సిందే. అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేసుకోవడంలో వీళ్లు ముందుంటారు. సిన్హాకూడా ఇలాంటివారి జాబితాలో చేరిపోయారు. అందువల్ల సిన్హాను కూడా అభినందించాలేమో. వారం రోజుల క్రితం గ్వాలియర్ ఐటీఎమ్‌లో డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా స్మారకసభలో సిన్హా ప్రధానోపన్యాసం చేశారు. అప్పుడు గాంధీకి ఒక డిగ్రీకూడా లేదని మీకు తెలుసా? అని విద్యార్థులను ప్రశ్నించారు. గాంధీకి ఉన్న అర్హత హైస్కూలు డిప్లమో మాత్రమేనని అవమానించారు. లా డిగ్రీ లేకపోయినా లాయర్‌గా పనిచేసేందుకు అర్హత సంపాదించారు. డిగ్రీ లేనివారు చదువుకున్న వాడు ఎలా అవుతాడు? అనికూడా ప్రశ్నించాడు. అయితే దేశంకోసం గాంధీ ఎంతో చేశాడనిమాత్రం అంగీకరించాడు. ఆయన సత్యాన్నే నమ్ముతాడని ఆయన చేసిందల్లా ఇదొక్కటేనని విద్యార్థుల ముందు తన అజ్ఞానాన్ని ప్రదర్శించాడు. ఎన్ని సవాళ్లు ఎదురైనా సత్యాన్ని మాత్రం వదిలిపెట్టలేదన్నాడు. అందువల్లనే ఆయన జాతిపిత అయ్యారని చెప్పారు. బహుశ: రాజకీయ వత్తిళ్లవల్లనే ఈ మాటలైనా చెపుతుంటారని భావిస్తున్నారు. ఇలా అజ్ఞానంగా మాట్లాడిన సిన్హాకు సరైన సమాధానం చెప్పవలసింది గాంధీ మునిమనవడు తుషార్‌గాంధీయే. మహాత్మాగాంధీ రాజ్‌కోట్‌లోని ఆల్‌ఫ్రెడ్ హైస్కూల్ నుంచి ఒక మెట్రిక్, లండన్ నుండి ఈ మెట్రిక్‌తో సమానమైన బ్రిటీష్ మెట్రిక్యులేషన్ పాసయ్యారని తుషార్‌గాంధీ వివరించారు. అలాగే బ్రిటన్‌లోని ఇన్నర్‌టెంపుల్ లా కాలేజీనుంచి లా డిగ్రీ పొందారు. అలాగే లాటిన్‌లో ఒకటి, ఫ్రెంచ్‌లో మరొకటి, రెండు డిప్లమోలని పొందారని తుషార్ తెలిపారు. ఇతరుల భావాలనుకూడా మన్నించాలన్న విషయాలను ఆర్‌ఎస్‌ఎస్ స్కూళ్లలో బోధించరని దీన్నిబట్టి అర్థమవుతోంది. తాముచెప్పిందే సరైనదని నమ్ముతూ వాదిస్తారు. మహాత్మాగాంధీ రాసిన ఆటో బయోగ్రఫీ పుస్తకం కాపీని సిన్హాకు పంపారు. ఆర్‌ఎస్‌ఎస్ తప్పులను ప్రచారం చేసే కళను కశ్మీర్ గవర్నర్‌కూడా అలవరచుకుని మాట్లాడుతున్నారని అనిపిస్తోంది.

రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువు

తాటిపాక మధు.

తొందరలోనే మనం అధికారంలోకి వస్తున్నాం.
ఈ ప్రభుత్వంలో మన దళిత బిడ్డలకు రక్షణలేదు.
కనీసం అంబేద్కర్ విగ్రహం కూడా పెట్టనివ్వడం లేదు.
మనం అధికారంలోకి రాగానే ఏ ఒక్క దళిత బిడ్డకు అన్యాయం జరగదు.
దళిత సంక్షేమమే మన ప్రభుత్వ లక్ష్యం.

ఈ వ్యాఖ్యలు 2018 సంవత్సరంలో ప్రతిపక్షపార్టీ నాయకుడిగా రాష్ట్రంలో నిర్వహించిన పాదయాత్రలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్న మాటలు. నాడు ప్రతిపక్షనేతగా చేసిన వ్యాఖ్యలకు నేడు జరుగుతున్న వాటికి సంబంధమేలేదు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటివరకు లెక్కలేని దాడులు దళితులు, మైనారిటీలపై జరుగుతూనేఉన్నాయి. దళిత వ్యవసాయ కూలి నుంచి వైద్యులు, న్యాయవాదులు వరకూ వైకాపా ప్రభుత్వంలో దాడులు, హత్యలకు బలైపోతూనేఉన్నారు. గత ప్రభుత్వం కన్నా ప్రస్తుత ప్రభుత్వంలో ఎస్సీలపై జరుగుతున్న దాడులు, హత్యలు నాలుగుశాతం పెరిగాయి. దేశవ్యాప్తంగా ఎస్సీలపై జరిగిన నేరాల్లో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉంది. ప్రశ్నించడమే పాపమన్నట్లు దాడులకు తెగబడుతున్నారు. కొన్ని చోట్ల హత్యలకు పాల్పడుతుండగా, మరికొన్నిచోట్ల ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని అధికారపార్టీ నేతలు అక్రమాకు పాల్పడుతున్నారు. ఏకంగా ఎస్సీలపై అట్రాసిటీ కేసులు పెడుతున్న విచిత్ర పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. రాష్ట్రంలో ఏ రాజ్యాంగం అమలవుతుందో అర్థంకావటంలేదని ఎమ్మెల్యేగాఉన్న తానే ఏపీలో అడుగు పెట్టాలంటే భయపడుతున్నానని ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఆందోళన వ్యక్తం చేసారంటే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోండి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రాతినిధ్యం వహిస్తున్న రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం మండలంలో అధికారపార్టీ ఇసుక దోపిడీని ప్రశ్నిస్తున్నాడనే నెపంతో ఇందుగపల్లి వరప్రసాద్ అనే దళిత యువకుడిని పోలీసులను అడ్డుపెట్టుకుని అధికారపార్టీకి చెందిన నేతలు అరెస్టు చేయించి పోలీస్‌స్టేషన్‌లోనే శిరోముండనం చేయించారు. ఈ దారుణానికి పాల్పడిన ఎఎస్ఐ, కొందరు కానిస్టేబుల్స్‌పైన ప్రోత్సహించిన అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులపై నేటికి చర్యలు తీసుకున్న దాఖలాలులేవు. అలాగే కాకినాడలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ తనవద్ద డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన సంఘటన చూశాము. కరోనా ఎక్కువగా ఉన్న సమయంలో మాస్కులు లేకుండా వైద్యం ఎలాచేయాలి అన్నందుకు డాక్టరును పోలీసులు చేతులు, కాళ్ళు కట్టేసి లాఠీలతో చిత్ర హింసలకు గురిచేసి ఆఖరికి ఆయనను పిచ్చోడినిచేసి పిచ్చాసుపత్రిలో చేర్చగా ఆయన మానసికంగా కుంగిపోయి ఆఖరుకు చనిపోయాడు. ఈ దారుణానికి వైసీపీ ప్రభుత్వానిదే బాధ్యత. మాస్క్ పెట్టుకోకుండా బయట తిరుగుతున్నారంటూ దళిత యువకుడు కిరణ్ కుమార్‌ను లాఠీలతో చితకబాది అతని చావుకు కారణమయ్యారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినందుకు జిల్లాకు చెందిన దళితుడు, మాజీ న్యాయవాది రామకృష్ణపై అక్రమ కేసులు బనాయించి తీవ్రంగా హింసించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన పుప్పాల సత్యనారాయణ, ఆయన సోదరుడు గంగాధర్‌ను పోలీసులు అన్యాయంగా బెదిరించారు. ఆ జిల్లాలో ముగ్గురు దళితులు వైకాపా ఆగడాలు భరించలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన దళిత యువకుడు ఆలపు గిరిష్ బాబు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో గిరీష్ అన్నయ్య స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. దీంతో వైసీపీ నాయకుడు ఆ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కేసుపెట్టించారు. పోలీసులు వేధింపులవల్ల 14 జిల్లాల్లో 21 మంది దళితులు ఆత్మహత్యలు చేసుకున్నారు. స్థానిక వైసీపీ నాయకుల అండదండలతో రాష్ట్రంలో 31 ఇళ్ళను కూల్చి వేశారు. ఆ కుటుంబాలన్నీ రోడ్ల పాలయ్యాయి. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని కడప పశువైద్యశాలలో డిడిగా పనిచేస్తున్న దళిత అధికారి చిన్న అచ్చెన్నను ఇలాగే చంపేశారు. అచ్చెన్న కనిపించట్లేదంటూ అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. వారం రోజుల క్రితం కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షంలో గ్రామదేవతల జాతర సందర్భంగా చోటుచేసుకున్న గొడవల్లో దళితులపై మరోవర్గం కర్రలు, రాళ్ళతో దాడికి పాల్పడింది. ఈ ఘటనలో దళిత యువకుడు నడిపల్లి రాము(23) ప్రాణాలు కోల్పోయాడు.

దళిత సంక్షేమంలో కోత : ముఖ్యమంత్రి అధికారం చేపట్టిన తర్వాత వేలకోట్ల రూపాయలు సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్ళించారు. నవరత్నాల పేరు చెప్పి అనేక సంక్షేమ పథకాలను ఎత్తివేశారు. దళిత ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దళితుల పథకాలను మంగళం పాడారు. ప్రైవేటు విద్యాలయాల్లో దళిత పిల్లలు చదువుకోవడానికి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ఎత్తివేశారు. భూమి కొనుగోలు పథకానికి నిధులు ఇవ్వడంలేదు. గత చంద్రబాబు ప్రభుత్వంలో అంబేద్కర్ విదేశీ విద్య పథకం కింద దళిత పిల్లలు ఎవ్వరు వెళ్ళినా వారికి రుణంమంజూరు అయ్యేది. ఇప్పుడు దానికి మంగళం పాడి కొన్ని కళాశాలలకే పరిమితం చేశారు. ఎస్సీ సంక్షేమానికి వచ్చే కేంద్ర నిధులను దారి మళ్ళించి దళితులను మోసం చేస్తున్నారు. ఇప్పటి వరకు డిఎస్‌సి లేదు, ఎస్సీ, ఎస్టి బ్యాగ్‌లాగ్ పోస్టులు భర్తీ చేయడం లేదు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయడంలేదు. ఎస్సీ కార్పోరేషన్లు మూతపడ్డాయి. ఇప్పటి వరకు 4 జిల్లాల్లో 9 మంది దళిత యువకులను శిరోముండనం చేయించారు. రావులపాలెంలో అంబేద్కర్ బొమ్మను చెత్తబుట్టలో ఎందుకు వేశారు అని ప్రశ్నించిన పాపానికి వైసిపి ఎమ్మెల్యే ముక్కుపచ్చలారని 14మంది దళిత బిడ్డలను పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్ళి లాఠీఛార్జి చేయించి జైలుకు పంపే ఏర్పాటుచేశారు. శిరోముండనం చేయించిన తోట త్రిమూర్తులును పార్టీలోకి తీసుకొని ఎమ్మెల్సీ చేశారు. ఇలా రాష్ట్రంలో ఇది అన్యాయం అని ప్రశ్నించిన ప్రతి దళితులు, దళిత మేధావివర్గంపై దాడి చేసి హత్యలు చేస్తున్నారు. ఇవి కేవలం కొన్ని సంఘటనలకు తార్కాణం మాత్రమే. దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించి దళిత, మైనార్టీ, బహుజనులందరూ ఐక్యం అవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశవైఖరిపై దళిత ఆత్మగౌరవ పోరాటయాత్ర చేయాలి.

(దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులపై నేడు విజయవాడలో రౌండ్‌టేబుల్)

వ్యాస రచయిత సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

ఆనాడు మోదీ చెప్పిన సుభాషితాలు

ఎం కోటేశ్వరరావు

"యువత ముందు నిలుచొని చెబుతున్నాను, దిల్లీలోని ప్రభుత్వం సిబిఐని చూపి మమ్మల్ని భయపెట్టలేదు "సిబిఐ మీద దేశం విశ్వాసం కోల్పోయింది" "సిబిఐకి భయపడని వారిలో నేను ఒకడిని" "మీరు ఏమైనా చేసుకోండి, కానీ సిబిఐ భయంతో అభివృద్ధి బాటను వీడేదిలేదు" "పరిణామాలు ఎలా మారతాయో నాకు తెలుసు, కానీ మేము సిద్ధపడిఉన్నాం" పాఠకులకు ఈ మాటలు ఎవరివో అర్థమయ్యే ఉంటాయి. ఇంకెవరివి! మోదీ ఏలుబడిలో వేధింపులకు గురవుతున్న ప్రతిపక్షనేతలు చేసిన ప్రకటనలు అనుకుంటే పొరపాటు. సాక్షాత్తూ మన గౌరవనీయ ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్ సిఎం పదవిలో ఉన్నపుడు చేసిన ఆరోపణలు. మోదీ అంటే అవినీతి అని అర్థం అంటూ గతంలో తానుచేసిన ట్వీట్‌ను తొలగించటం లేదని బిజెపి నేత ఖుష్బూ ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే సిబిఐ గురించి మోదీ చెప్పిన ఈ అంశాలు ఆయన వెబ్‌సైట్‌లో ఇప్పటికీ దర్శన మిస్తున్నాయి. అంతే కాదు మోదీ చెప్పిన సుభాషితాలు ఇంకా ఇలా ఉన్నాయి. "సిబిఐ అంటే కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్" " గుజరాత్‌ను కించపరిచేందుకు అబద్ధాలు చెప్పవద్దు" " సిబిఐని రాజకీయమయం కావించేందుకు సమయాన్ని ఖర్చుచేసే బదులు ఉత్తరాఖండ్‌లో ఇబ్బందులు పడుతున్నవారికి సహాయ పడేందుకు వెచ్చించండి" అని కూడా చెప్పారు. 2013 జూన్ 24న గాంధీనగర్‌లో స్వామి వివేకానంద ఉపాధి వారంలో భాగంగా జరిగిన సభలో నరేంద్రమోదీ ప్రసంగించారు. పైన పేర్కొన్న ఆరోపణలన్నీ అక్కడ చేసినవే. ఈ రోజుల్లో పత్రికల్లో సగం వార్తలు సిబిఐ సంబంధమైన వాటితో నింపుతున్నారు. అమాయకులను ఇబ్బంది పెడుతున్నారు. వారి రాజకీయ యజమానులను సంతృప్తి పరచేందుకే ఇలా చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైంది కాదు. మీరుపోటీ పడాలనుకుంటే పడదాం. ఎవరు ఎన్ని ఉద్యోగాలను ఇవ్వగలమో చూసుకుందాం అని కూడా మోదీ సవాల్ చేశారు. అప్పటికే మోదీని తమ నేతగా లోక్‌సభ ఎన్నికల్లో రంగంలోకి దించేందుకు బిజెపి నిర్ణయించిన పూర్వరంగంలో చేసిన ప్రసంగమది.

అలాంటి మోదీ గుజరాత్ సిఎంగా ఉండగా ఒక నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో ఇరికించేందుకు సహకరించాల్సిందిగా కేంద్రంలో యుపిఏ ప్రభుత్వం అధికారంలో ఉండగా సిబిఐ తనపై వత్తిడి తెచ్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. తన మీద వత్తిడి తెచ్చినప్పటికీ దాని గురించి బిజెపి ఎన్నడూ రచ్చచేయలేదని కూడా షా చెప్పారు. కాంగ్రెస్ పాలకుల మీద ఎంత ఉదారత ! మరి ఇప్పుడెందుకు చెప్పినట్లు ? అన్న ప్రశ్న జనంలో తలెత్తుతోంది. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందంటూ ప్రతిపక్షాలుచేసిన విమర్శలమీద అమిత్ షా ప్రారంభించిన ఎదురుదాడిలో భాగంగా ఈ అరోపణ చేశారు అన్నది స్పష్టం. అవినీతి పరులందరూ ఒక దగ్గర చేరుతున్నారంటూ ప్రతిపక్షాలమీద నరేంద్రమోదీ దాడిచేసిన తరువాత అమిత్ షా ఈ మాటలను చెప్పి చర్చను పక్కదారి పట్టించేందుకు చూశారు. పరువునష్టం కేసులో శిక్ష పడిన రాహుల్ గాంధీ హైకోర్టులో అప్పీలుకు పోకుండా ప్రధాని మోదీని నిందిస్తూ రచ్చచేస్తున్నారని ఆరోపించారు. అప్పీలు చేసుకోవాలా లేదా అనేది రాహుల్ గాంధీకి చెందిన అంశం. ఏమి చేయాలో కూడా బిజెపి నేతలు చెబుతారా ? లేక వారు అనుకున్న విధంగా జరగటం లేదని ఉక్రోషమా ? శిక్ష విధించిన కోర్టు అప్పీలుకు ఇచ్చిన గడువు గురించి తెలిసినప్పటికీ రాహుల్‌ను అనర్హుడిగా ప్రకటించేందుకు లోక్‌సభ సచివాలయం ఎందుకు తొందరపడిందో అమిత్ షా చెప్పి ఉంటే బాగుండేది.

రాజస్థాన్‌లోని మార్బుల్ వ్యాపారులు తమను వేధిస్తున్న గుజరాత్‌కు చెందిన సొహ్రాబుద్దీన్ షేక్‌ను అదుపు చేయాలని కోరగా నాడు రాష్ట్ర హోంమంత్రిగా ఉన్న అమిత్ షా ఆదేశాల మేరకు పోలీసులు 2005లో సొహ్రాబుద్దీన్‌తో పాటు అతని భార్య కౌసర్‌ను కాల్చి చంపినట్లు ఆరోపణలు వచ్చాయి. దానిపై అమిత్ షా రాజీనామా చేశారు, అదే కేసులో సిబిఐ అరెస్టు చేసింది. సొహ్రాబుద్దీన్ లష్కరే తోయిబాకు చెందినవాడని, నరేంద్రమోదీని హత్య చేసేందుకు కుట్రపన్నినట్లు గుజరాత్ పోలీసులు ఆరోపించారు. అమిత్ షా ఆదేశాలమేరకు అతన్ని చంపినట్లు తమ దగ్గర ఆధారాలు న్నాయని, దాని గురించి సిఎం నరేంద్రమోదీకి తెలుసా లేదా అని నిర్ధారణ చేసుకొనేందుకు ఆయనను కూడా ప్రశ్నించవచ్చని సిబిఐ భావించినట్లు వార్తలు వచ్చాయి. నకిలీ ఎన్‌కౌంటర్ కేసుల భయంతోనే నరేంద్రమోదీ సిబిఐ మీద దాడులు చేస్తున్నట్లు 2013లోనే కాంగ్రెస్ విమర్శించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే సిబిఐ పనిచేస్తోందని కూడా గుర్తు చేసింది.

సిబిఐపై నరేంద్రమోదీ పదే పదే దాడి చేశారు. ఒక్క సిబిఐ మీదనే కాదు, చివరికి కోర్టులు, జడ్జీలను కూడా లాగారు. భావనగర్‌లో 2010 జులై 31న మాట్లాడుతూ "గుజరాత్ నుంచి కేసులను బదిలీ చేయాలని సిబిఐ చెబుతున్నది. ఇది గుజరాత్‌లోని కోర్టులను, లాయర్లను అమానించటమే, ఎంతకాలం దీన్ని సహించాలి ? మన న్యాయ విశ్వవిద్యాలయాలను మూసుకోవాలా, లాయర్లు రోడ్డున పడాలా ? తొలుత నన్ను లక్ష్యంగా చేసుకున్నారు. తరువాత పోలీసులు, ఇప్పుడు కోర్టులు. నా రక్తం ఉడికిపోతోంది. గుజరాత్ దేశంలో భాగం కాదా, ఒక శత్రు రాష్ట్రంగా ఎందుకు పరిగణిస్తున్నారు. ఉగ్రవాదంమీద పోరు జరపకుండా నన్ను నిరోధిస్తున్నారు. ఓటు బాంకు రాజకీయాల్లో భాగంగా నిందితులను అరెస్టు చేయటం లేదు. నా సన్నిహితుడు అమిత్ షా మీద సిబిఐ కేసు నమోదు చేసింది. ఇది ప్రభుత్వాన్ని బలహీనపరిచే రాజకీయ ప్రయత్నమే. నన్ను భయపెట్టే ప్రయత్నాలు మానుకోండి. ఏ మాత్రం భయపెట్టలేరు. ఇది జాతీయవాదులు, జాతివ్యతిరేకుల మధ్య పోరు, గుజరాత్ యుద్ధభూమి. గుజరాత్ గెలుస్తుంది." అని చెప్పారు.

సిబిఐపై నరేంద్రమోదీ పదే పదే దాడి చేశారు. ఒక్క సిబిఐ మీదనే కాదు, చివరికి కోర్టులు, జడ్జీలను కూడా లాగారు. భావనగర్‌లో 2010 జులై 31న మాట్లాడుతూ "గుజరాత్ నుంచి కేసులను బదిలీ చేయాలని సిబిఐ చెబుతున్నది. ఇది గుజరాత్‌లోని కోర్టులను, లాయర్లను అమానించటమే, ఎంతకాలం దీన్ని సహించాలి ? మన న్యాయవిశ్వవిద్యాలయాలను మూసుకోవాలా, లాయర్లు రోడ్డున పడాలా ? తొలుత నన్ను లక్ష్యంగా చేసుకున్నారు. తరువాత పోలీసులు, ఇప్పుడు కోర్టులు. నా రక్తం ఉడికి పోతోంది. గుజరాత్ దేశంలో భాగం కాదా, ఒక శత్రు రాష్ట్రంగా ఎందుకు పరిగణిస్తున్నారు. ఉగ్రవాదంమీద పోరు జరపకుండా నన్ను నిరోధిస్తున్నారు. ఓటు బాంకు రాజకీయాల్లో భాగంగా నిందితులను అరెస్టు చేయటం లేదు. నా సన్నిహితుడు అమిత్ షా మీద సిబిఐ కేసు నమోదు చేసింది. ఇది ప్రభుత్వాన్ని బలహీనపరిచే రాజకీయ ప్రయత్నమే. నన్ను భయపెట్టే ప్రయత్నాలు మానుకోండి. ఏ మాత్రం భయపెట్టలేరు. ఇది జాతీయవాదులు, జాతివ్యతిరేకుల మధ్య పోరు, గుజరాత్ యుద్ధభూమి. గుజరాత్ గెలుస్తుంది." అని చెప్పారు.

అవినీతిలో కూరుకుపోయిన వారందరూ ఒక దగ్గరకు చేరుతున్నారని ఇప్పుడు ప్రధాని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ సహా 14 పార్టీలకు చెందిన వారు సిబిఐ, ఈడిలను తమ నేతల మీద ప్రయోగిస్తున్నారంటూ సుప్రీంకోర్టు తలుపు తట్టగా విచారణకు స్వీకరించింది. దీంతో మో-షా రంగంలోకి దిగారు. యుపిఏ 2004-14 పాలనా కాలంలో అక్రమాలకు పాల్పడిన వారినుంచి కేవలం రు.ఐదువేల కోట్ల విలువ గల ఆస్తులు మాత్రమే పిఎంఎల్‌ఏ కేసుల్లో స్వాధీనం చేసుకున్నారని తాము తొమ్మిది సంవత్సరాల్లో లక్షా పదివేల కోట్ల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు ప్రధాని చెప్పారు. యుపిఏ పాలనాకాలంలో ఈడి 112 దాడులు చేసి రు.5,346 కోట్లు స్వాధీనం చేసుకోగా, మోదీ అధికారానికి వచ్చాక ఎనిమిది సంవత్సరాల్లో 3010 దాడులు రు.99,356కోట్ల ఆస్తి స్వాధీనం చేసుకున్నట్లుగా 2022 జులై 27న పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటించింది. దీని ప్రకారం కాంగ్రెస్ ఏలుబడిలో సగటున ఒక్కో కేసులో 47.7 కోట్లు స్వాధీనం చేసుకోగా, మోదీ పాలనలో రు.33 కోట్లుగా ఉంది. విదేశీమారక ద్రవ్య అక్రమాల కేసులు ఇదే విధంగా 8,586 నుంచి 22,320కి పెరిగినట్లు ప్రభుత్వం చెప్పింది. దాడులు జరిపిన 3,010 కేసులలో చార్జిషీట్లు దాఖలు చేసింది 888 కేసుల్లో కాగా శిక్షలుపడింది 23 కేసుల్లో, వాటిలో స్వాధీనం చేసుకున్న ఆస్తి విలువ రు.869 కోట్లని కూడా ప్రభుత్వం తెలిపింది. అందువలన దాడుల సంఖ్య పెరిగినా ఆస్తులను లక్ష కోట్ల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించినా తేలిన కేసులు, స్వాధీన మొత్తాలను చూస్తే అది నామమాత్రమే అన్నది స్పష్టం. మోదీ ఏలుబడిలో 2014 ఏప్రిల్ ఒకటి నుంచి 3,555 మనీలాండరింగ్ కేసులు నమోదు కాగా చార్జిషీట్లు దాఖలు చేసింది 2022 మార్చి వరకు 992 మాత్రమే. అవినీతి, అక్రమాల తామెంత నిబద్ధతతో ఉన్నదీ తమ ఏలుబడిలో కేసుల సంఖ్య పెరగటాన్ని సూచిస్తున్నదని ప్రభుత్వం చెప్పుకుంది. వాటిలో ఎక్కువభాగం బెదరింపులు, కేసుల్లో ఇరికించేందుకు చేసిన దాడులే అన్నది విమర్శ.

వెనక్కి తగ్గని విపక్షాలు

అదానీ కుంభకోణంపై జేపీసీకి పట్టు

బీజేపీ ఎదురుదాడి

రేపటికి పార్లమెంటు వాయిదా

న్యూఢిల్లీ: అదానీ కుంభకోణంపై ప్రతిపక్షాలు పట్టువిడవని విక్రమార్కుడిలా పోరాడుతున్నాయి. అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ జరపాల్సిందేనని పార్లమెంటు లోపలా, బయటా డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై మోదీ సర్కారు మాత్రం నోరు మెదపడం లేదు. అదానీ కుంభకోణం, దీనిపై మోదీ సర్కారు మౌనంపై విపక్షాలు ఆందోళన చేయడంతో పార్లమెంటు ఉభయసభలు బుధవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభలో స్పీకర్, రాజ్యసభలో చైర్మన్ పోడియం వద్దకు విపక్ష సభ్యులు దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహావీర్ జయంతి సందర్భంగా మంగళవారం సెలవు కావడంతో పార్లమెంటు తిరిగి బుధవారం సమావేశమవుతుంది. లోక్‌సభ ఉదయం సమావేశం కాగానే ఇటీవల మృతిచెందిన ఎంపీ గిరీశ్ బాపట్, మాజీ ఎంపీ ఇనోసెంట్ మృతికి సంతాపం ప్రకటించింది. బీజేపీకి చెందిన పూనె ఎంపీ బాపట్ మార్చి 29న మృతిచెందగా కేరళలోని త్రిసూర్ మాజీ ఎంపీ ఇనోసెంట్ మార్చి 26న కన్నుమూశారు. సిట్టింగ్ సభ్యుడి మృతితో సభను కొద్దిగంటలు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. సభ తిరిగి రెండు గంటలకు ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. పారిశ్రామికవేత్త గౌతం అదానీ వ్యాపార గ్రూప్‌నకు సంబంధించిన ఆరోపణలపై జేపీసీ విచారణకు డిమాండ్ చేశారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు, వాగ్వాదంతో స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేశారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల రెండో విడత ప్రారంభమైన నాటి నుంచి అదానీ వ్యవహారంపై ఉభయసభలు అట్టుడుకుతున్నాయి. దీనికి ప్రతిగా రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని అధికార బీజేపీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఉభయసభల్లోనూ ఎలాంటి కార్యకలాపాలు కొనసాగడం లేదు.

మరోవైపు, రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. సభలో గందరగోళం మధ్యనే ఎలాంటి చర్చ లేకుండా పోటీ(సవరణ) బిల్లు-2023ను ప్రభుత్వం ఆమోదింపచేసుకుంది. కాగా, రాజ్యసభ దినోత్సవం సందర్భంగా సభ్యులకు చైర్మన్ జగదీప్ ధన్కర్ అభినందనలు తెలిపారు. సభలో అల్లరి చేయడానికి బదులు చర్చలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాల నినాదాల మధ్య పోటీ(సవరణ) బిల్లును ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల నిరసనలు కొనసాగుతుండగానే మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందినట్లు చైర్మన్ ప్రకటించి...సభను వాయిదా వేశారు.

మనది స్వతంత్ర మీడియా

కేంద్రమంత్రి ఠాకూర్ వెల్లడి

నాగపూర్: విదేశీ మీడియా కన్నా భారత్ మీడియా చాలా శక్తివంతమైనదని కేంద్ర సమాచార, ప్రసారశాఖమంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. కరోనా మహమ్మారి సమయంలో కొన్ని విదేశీ మీడియా సంస్థలు భారత్ గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశాయని, దేశ ప్రతిష్ఠను మంటగలిపేందుకు విశ్వప్రయత్నం చేశాయని, దీనిని అడ్డుపెట్టుకొని స్వార్థ ప్రయోజనాల కోసం మన నాయకులు సైతం తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. గతంలో భారతీయ మీడియా స్వతంత్రంగా ఉండేదని, ఇప్పుడు, భవిష్యత్‌లోనూ అలాగే ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లోక్‌మట్ నేషనల్ మీడియా సదస్సులో 'భారతీయ మీడియా విభజనకు గురైందా' అనే అంశంపై ఠాకూర్ మాట్లాడారు. జర్నలిస్టులు, మేధావులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. భారతీయ మీడియా గతంలో స్వతంత్రంగా ఉండేది. నేడు అలాగే ఉంది. భవిష్యత్‌లోనూ ఇలాగే ఉంటుందని ప్రభుత్వం తరపున తాను హామీ ఇస్తున్నానని ఠాకూర్ చెప్పారు. 'కొంతమందిని లక్ష్యంగా చేసుకోవాలన్న ఉద్దేశం ఎవరికీ ఉండదు. అయితే, ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి...తమ సొంత సంక్షేమం, కీర్తి కోసం కొన్ని రాజకీయ పార్టీలు మీడియాను అడ్డుపెట్టుకోవడమే పెద్ద ప్రశ్నగా మిగిలింది' అని మంత్రి అన్నారు. ఈ ప్రభావం కొన్నిసార్లు వార్తలలోనూ కనిపిస్తోందన్నారు. విదేశీ మీడియా సంస్థలను దుయ్యబడుతూ కోవిడ్ సమయంలో గంగానది ఒడ్డున గుట్టలు గుట్టలుగా శవాలు పడి ఉన్నాయని, నీటిపై తేలియాడుతున్నాయని తప్పుడు కథనాలు వండి వార్చాయని గుర్తుచేశారు. ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని, అయినా అత్యధిక మీడియా సంస్థలు కనీసం తనిఖీ చేసుకోకుండా వార్తలు ప్రచురించాయని ఆరోపించారు. ఇది కేవలం ఓ వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాదని, యావత్ దేశం ప్రతిష్ఠను మంటకలపడమేనని మంత్రి ఠాకూర్ వ్యాఖ్యానించారు.

వృద్ధులకు రైలు చార్జీల రాయితీ పునరుద్ధరించండి

మోదీకి కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ: వృద్ధులకు రైలు చార్జీల్లో రాయితీలు పునరుద్ధరించాలని ప్రధాని నరేంద్రమోదీకి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మోదీకి కేజ్రీవాల్ లేఖ రాశారు. కేంద్ర బడ్జెట్ రూ.45 లక్షల కోట్లు ఉందని, వృద్ధులకు చార్జీల్లో రాయితీ ఇవ్వడం వల్ల కేవలం రూ.1600 కోట్లు మాత్రమే అవుతుందని తెలిపారు. ఈ రాయితీ మొత్తం సముద్రంలో నీటిబొట్టు వంటిదని పేర్కొన్నారు.

ఈ మొత్తం వృద్ధులకు వెచ్చించడం వల్ల ప్రభుత్వమేమీ దివాలా తీయబోదని కేజ్రీవాల్ తెలిపారు. రైలు చార్జీల్లో రాయితీ ఎత్తివేయడం వల్ల వృద్ధుల పట్ల ప్రభుత్వానికి కనీస మర్యాద, జాగ్రత్త లేదనే సందేశం వెళుతుందని, ఇది మన దేశ సంస్కృతి కాదని విన్నవించారు. పెద్దల ఆశీస్సులు లేకపోతే ఏ వ్యక్తీ, సమాజం లేదా దేశం ప్రగతిపథంలో ముందుకు సాగలేదని హితవు పలికారు. ఢిల్లీలో తమ ప్రభుత్వం అన్ని ప్రార్థనామందిరాల వద్ద పెద్దలకు ఉచిత సదుపాయాలు కల్పించడంతో... వారి ఆశీస్సులు లభించి అన్నిరంగాల్లో ఢిల్లీ ప్రగతిసాధించినట్లు కనిపిస్తోందని గుర్తుచేశారు. కోవిడ్ వ్యాప్తిని నియంత్రించడానికిగాను ప్రజలు బయట తిరగకుండా చేయడంలో భాగంగా 2020లో కేంద్రం వృద్ధులకు కల్పిస్తున్న రాయితీ సదుపాయాన్ని ఎత్తివేసింది. వృద్ధులకు రైల్వే చార్జీల్లో రాయితీ పునరుద్ధరించాలని పార్లమెంటరీ స్థాయీసంఘం కూడా ఇటీవల సిఫార్సు చేసింది.

కొన్ని మందులపై ఏడు శాతం ధర తగ్గింపు

న్యూఢిల్లీ: అత్యవసరంగా వినియోగించే సుమారు 651 మందుల ధరలు సగటున 6.73 శాతం తగ్గినట్లు నేషనల్ ఫార్మాసూటికల్ ప్రైసింగ్ అథారిటీ తెలిపింది. ఏప్రిల్ నెల నుంచి ఈ తగ్గింపు అమలులోకి వచ్చినట్లు వెల్లడించింది. మందుల ధరలను నియంత్రించే ఎన్‌పీపీఏ సంస్థ తన ట్విట్టర్‌లో ఈ విషయాన్ని తెలిపింది. ఎన్‌ఎల్‌ఈఎం జాబితాలో మొత్తం 870 షెడ్యూల్డ్ మందులు ఉన్నాయని, అయితే ఆ జాబితాలోని 651 మందులకు ప్రభుత్వం సీలింగ్ విధించినట్లు తెలిపింది. సెప్టెంబర్ 2022లో ఎన్‌ఎల్‌ఈఎంను ఆరోగ్య మంత్రిత్వశాఖ సవరించిన విషయం తెలిసిందే. తాజాగా విధించిన సీలింగ్‌తో ఆ 651 మందుల ధరలు మొత్తంగా 16.62 శాతం తగ్గినట్లు నేషనల్ ఫార్మసిటికల్ ప్రైసింగ్ అథారిటీ పేర్కొన్నది. ఆ 651 మందులకు ధరలను ఫిక్స్ చేయడం వల్ల వాటి ధరలు 12.12 శాతం పెరగకుండా ఏప్రిల్ నుంచి 6.73 శాతం తగ్గినట్లు ఎన్‌పీపీఏ తెలిపింది.

వంట గ్యాస్ ధర తగ్గించండి

ఆర్థిక మంత్రికి గృహిణుల మొర

చెన్నై: వంట గ్యాస్ ధర తగ్గించాలని తమిళనాడు కాంచీపురం జిల్లాలోని పజయసీవరం గ్రామంలో స్థానిక మహిళలు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. సహాయ మంత్రి ఎల్ మురుగన్‌తో కలిసి గ్రామంలో ప్రచారానికి వచ్చిన సందర్భంగా మహిళలు వంట గ్యాస్ భారాన్ని మోయలేమని ఆర్థిక మంత్రికి మొరపెట్టుకున్నారు. తనను కలిసిన మహిళలతో కొద్దిసేపు ముచ్చటించిన నిర్మలా సీతారామన్ ప్రభుత్వ పథకాలతో మీరు లబ్ధి పొందుతున్నారా అని వారిని ప్రశ్నించారు. వంట గ్యాస్ ధర అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా నిర్ణయిస్తారని మంత్రి మహిళలకు వివరించారు. మన దేశంలో వంట గ్యాస్ లేదని, మనం దాన్ని దిగుమతి చేసుకుంటామని చెప్పారు. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరిగితే దేశంలోనూ ధర పెరుగుతుందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వంట గ్యాస్ ధర తగ్గితే ఇక్కడ కూడా తగ్గుతుందని చెప్పుకొచ్చారు. అయితే గత రెండేళ్లుగా వంట గ్యాస్ ధర తగ్గలేదని అన్నారు.

ఎస్‌బీఐ ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం

ముంబై: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం 'భారతీయ స్టేట్‌బ్యాంక్' ఆన్‌లైన్ సేవల్లో సోమవారం ఉదయం అంతరాయం ఏర్పడింది. యూపీఐ లావాదేవీలు, నెట్ బ్యాంకింగ్, అధికారిక యోనో యాప్ వినియోగంలో సమస్యలు తలెత్తినట్లు అనేకమంది ఖాతాదారులు సోషల్ మీడియా వేదికగా తమ అసౌకర్యాన్ని తెలిపారు. ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ డౌన్ డిటెక్టర్ ఇండియా సైతం ఎస్‌బీఐ ఖాతాదారుల సమస్యను ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. సోమవారం ఉదయం దాదాపు 9 గంటల నుంచి ఖాతాదారుల ఫిర్యాదులు ప్రారంభమైనట్లు తెలిపింది. కొంత మంది మాత్రం ఆదివారం నుంచే తాము సమస్య ఎదుర్కొంటున్నట్లు ట్విటర్‌లో రాసుకొచ్చారు. మరికొందరైతే రెండు, మూడు రోజుల నుంచి తాము ఎస్‌బీఐ ఆన్‌లైన్ లావాదేవీల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ఎస్‌బీఐ తమ ఆన్‌లైన్ సేవలకు ఏప్రిల్ ఒకటో తేదీన స్వల్ప విరామం ఇచ్చింది.

ఆ రోజు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 4:45 వరకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, యోనో లైట్, యోనో బిజినెస్, యూపీఐ సేవలు అందుబాటులో ఉండవని ట్విటర్ వేదికగా ప్రకటన విడుదల చేసింది. వార్షిక ఖాతాల ముగింపు నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. అయితే, అప్పటి నుంచి తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అనేక మంది ఖాతాదారులు ట్విటర్‌లో పేర్కొన్నారు.

పెరిగిన నిరుద్యోగం

మూడు నెలల గరిష్ఠానికి చేరిక

మార్చిలో 7.8శాతంగా నమోదు

సీఎంఐఈ వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో నిరుద్యోగిత రేటు పెరిగింది. ఈ ఏడాది మార్చిలో మూడు నెలల గరిష్ఠంగా 7.8 శాతానికి చేరింది. నాలుగు నెలలుగా 7 నుంచి 8 శాతం మధ్య నిరుద్యోగిత రేటు ఊగిసలాడుతోంది. 2022 డిసెంబరులో 8.30 శాతంగా ఉంటే 2023, జనవరికి 7.14శాతానికి, ఫిబ్రవరిలో 7.45శాతానికి ఎగబాకింది. ఈ మేరకు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) డేటా తెలిపింది. మార్చిలో పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు 8.4 శాతంగా, గ్రామాల్లో 7.5 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. మార్చిలో భారతీయ కార్మిక మార్కెట్లు క్షీణించినట్లు సీఎంఐఈ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్ వ్యాస్ తెలిపారు. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా హరియాణాలో 26.8శాతం, ఉత్తరాఖండ్‌లో అత్యల్పంగా 0.8 శాతం చొప్పున నిరుద్యోగిత రేటు ఉన్నట్లు సీఎంఐఈ తెలిపింది. అలాగే రాజస్తాన్‌లో 26.4శాతం, జమ్ముకశ్మీర్‌లో 23.1శాతం, సిక్కింలో 20.7శాతం, బీహార్‌లో 17.6శాతం, జార్ఖండ్‌లో 17.5శాతంగా నమోదైంది. ఉత్తరాఖండ్, చత్తీస్‌గఢ్, పుదుచ్చేరి, గుజరాత్, కర్నాటక, మేఘాలయ, ఒడిశాలో అత్యల్పంగా నిరుద్యోగిత రేట్లు నమోదైనట్లు వెల్లడించింది. మరోవైపు ఉపాధి రేటు ఫిబ్రవరిలో 36.9శాతంగా ఉంటే మార్చిలో 36.7శాతానికి చేరింది. గణాంకాల ప్రకారం ఫిబ్రవరిలో ఉపాధి రేటు 409.9 మిలియన్ల నుంచి 407.6 మిలియన్లకు పడిపోయింది. కాగా ప్రస్తుత దృశ్యం....ఆలోచనాత్మక స్థితికి సూచికమని టీమ్‌లీజ్ సర్వీసెస్ సహ వ్యవస్థాపకులు రితుపర్ణ చక్రవర్తి అన్నారు. ఇండియా ఇంక్ ఆచితూచి అడుగులు వేస్తోందని చెప్పారు. అక్టోబరు-జనవరి తర్వాత రిటైల్, సరఫరా గొలుసులు, లాజిస్టిక్స్, ఆర్థిక సేవలు, ఈ-కామర్స్ రంగాల్లో ఉపాధి తగ్గిందని సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ డైరెక్టర్ ఆదిత్య మిశ్రా తెలిపారు. ఐటీ, టెక్నాలజీ, స్టార్టప్‌లతో సహా అనేక రంగాల్లో నియామకాలు తగ్గించడం ఇందుకు కారణమని చెప్పారు.

కేరళలో అమానుషం

- కదులుతున్న రైల్లో ప్రయాణికుడికి నిప్పు
- రైలు నుంచి దూకడంతో ముగ్గురి మృతి
- నిందితుడిని గుర్తించలేదన్న పోలీసులు

కోజికోడ్: కేరళలో ఆదివారం రాత్రి అమానుషం చోటుచేసుకుంది. కదులుతున్న రైల్లో తోటి ప్రయాణికుడితో వాగ్వాదానికి దిగి అతడిపై ఓ వ్యక్తి పెట్రోల్‌తో దాడికి పాల్పడ్డాడు. ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవదహనం చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆ మంటలు ఇతర ప్రయాణికులకు అంటుకున్నాయి. ఈ ఘటనలో ఏడాది చిన్నారి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. కాగా, ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని ఇంకా గుర్తించలేదని రైల్వే పోలీసులు సోమవారం వెల్లడించారు. నిందితుడిపై హత్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఫోరెన్సిక్ బృందం ఘటనలో స్థలిలో పరీక్షించిందని వివరించారు. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అలప్పుజ-కన్నూర్ ఎగ్జిక్యూటివ్ ఎక్స్‌ప్రెస్ రైలు కోజికోడ్ నగరాన్ని దాటి కోరపుళ రైల్వే వంతెన వద్దకు చేరుకుంది. ఆ సమయంలో ఓ వ్యక్తి తన తోటి ప్రయాణికుడిపై పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. దీంతో ఒక్కసారిగా ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. చూస్తుండగానే ఆ మంటలు ఇతరులకు అంటుకున్నాయి. దీంతో అప్రమత్తమైన ప్రయాణికులు ఎమర్జెన్సీ చైన్ లాగి రైలును నిలిపి...ప్రయాణికులకు అంటుకున్న మంటలు ఆర్పివేశారు. సమాచారమందుకున్న రైల్వే పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. గాయపడిన 8 మంది ప్రయాణికులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన తర్వాత రైల్లో నుంచి ముగ్గురు ప్రయాణికులు కనిపించలేదని తోటివారు గుర్తించారు. వెంటనే పోలీసులు గాలింపు చేపట్టగా.. ఘటన జరిగిన సుమారు 100 మీటర్ల దూరంలోని రైల్వేట్రాక్‌పై వారి మృతదేహాలు కనిపించాయి. ఏడాది చిన్నారి సహా ఒక మహిళ, ఒక పురుషుడి మృతదేహాలను పోలీసులు గుర్తించి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటన సమయంలో వీరు రైలు నుంచి జారిపడటం లేదా కిందకు దిగేందుకు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారిగా తెలుస్తోంది. ఈ హత్యాయత్నం ఘటనతో వారికి సంబంధం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మరోవైపు ఘటన తర్వాత నిందితుడు పారిపోయాడు. ఎమర్జెన్సీ చైన్ లాగడంతో రైల్వే వంతెనపై రైలు ఆగింది. ఆ సమయంలో నిందితుడు రైలు నుంచి దూకి పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. అయితే అప్పటికే ఓ వ్యక్తి నిందితుడి కోసం బైక్‌పై అక్కడ వేచి ఉండటం తాము చూశామని తెలిపారు.

నిందితుడు అక్కడ వదిలివెళ్లిన బ్యాగ్‌లో ఎలాంటి ఆధారాలు లభించలేదని, అందులో ఓ పెట్రోల్ బాటిల్ మాత్రమే ఉందని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. దీనిని ఉగ్రవాద చర్యగా భావించలేమన్నారు. దీనికి సంబంధించి ఎలాంటి సమాచారం లేదన్నారు.

డ్యాన్స్ టీచర్‌పై లైంగిక వేధింపుల కేసు

చెన్నై: లైంగిక వేధింపులకు పాల్పడిన కళాక్షేత్ర ఫౌండేషన్‌కు చెందిన రుక్మిణీదేవీ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ డ్యాన్స్ టీచర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. డ్యాన్స్ టీచర్ హరి పద్మన్‌పై లైంగిక వేధింపులకు సంబంధించిన అనేక సెక్షన్లు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్‌లో హరి పద్మన్‌తో పాటు మరో నలుగురు టీచర్లు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పద్మన్‌పై లైంగిక వేధింపుల కేసులో సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయడానికి తమిళనాడు పోలీసులు ఆదివారం కేరళ వెళ్లినట్లు పోలీసులు చెప్పారు.

మోదీ ఏ కాలేజీ నుంచి డిగ్రీ పొందారు?

ప్రశ్నించిన ఉద్ధవ్

ముంబై: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డిగ్రీ సర్టిఫికెట్ వ్యవహారం గత వారం రోజులుగా దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మోదీ డిగ్రీ సర్టిఫికెట్ వివరాలు అడిగినందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు గుజరాత్ హైకోర్టు రూ. 25 వేలు జరిమానా విధించిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీ విద్యార్హత పత్రాలను బయటపెట్టాల్సిన అవసరం లేదని కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే మోదీ సర్టిఫికెట్ వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారింది. తాజాగా ఇదే అంశంపై శివసేన చీఫ్ , మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే స్పందించారు. మోదీపై విమర్శలు గుప్పించారు. 'దేశంలో ఎంతో మంది డిగ్రీ చదివిన యువత ఉద్యోగాలు లేకుండా ఉన్నారు. మోదీని డిగ్రీ సర్టిఫికెట్ చూపించమని అడిగినందుకు రూ.25వేలు జరిమానా విధించారు. మోదీకి ఏ డిగ్రీ ఉంది..? ఏ కాలేజీ నుంచి డిగ్రీ పట్టా పొందారు..? ఏ కళాశాల అయినా తన విద్యార్థి దేశానికి ప్రధాని అయితే గర్వపడుతుంది. ప్రధాని తమ కాలేజీలోనే చదివారు అంటూ గొప్పగా చెప్పుకుంటుంది. అయితే మోదీ చదివిన కళాశాలకు ఆ గర్వం ఎందుకు కలగలేదు..?' అని ఉద్ధవ్ ప్రశ్నించారు.

టికెట్ల కోసం వీధినపడ్డ కాంగ్రెస్ నేతలు

బెంగళూరు: వచ్చే నెలలో జరగనున్న కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలకు టికెట్ ఆశిస్తున్న కాంగ్రెస్ నేతలు వీధినపడ్డారు. ఈ ఎన్నికలలో పోటీచేసే 124 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను మార్చి 25న కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. అయితే కొందరు నేతల పేర్లు ఇందులో లేవు. ఈ నేపథ్యంలో అనేక నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సోమవారం బెంగళూరు చేరుకున్నారు. క్వీన్స్ రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాలో తమ నేతలకు టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) మంగళవారం సమావేశం కానున్నది. వంద మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తమ నేతలకు టిక్కెట్లు ఇవ్వాలంటూ అనేక నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నిరసనకు దిగారు. పార్టీ కార్యాలయం ఎదుట నినాదాలతో హోరెత్తించారు.

కాగా, రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్ అహ్మద్ దీనిపై స్పందించారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందుకే పార్టీ టిక్కెట్ల కోసం చాలా డిమాండ్ ఉందన్నారు. సీఈసీ సమావేశం మంగళవారం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే అనేక నియోజకవర్గాల నుంచి సర్వే నివేదికలు అందాయని చెప్పారు. ఉత్తమ అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లు లభిస్తాయని వెల్లడించారు.

హుగ్లీ జిల్లాలో కొనసాగిన నిషేధాజ్ఞలు

రిష్రా/షిబ్‌పూర్: పశ్చిమబెంగాల్ హుగ్లీ జిల్లాలో హింస చెలరేగిన రిష్రా, సెరాంపూర్‌లలో పరిస్థితి ప్రశాంతంగా, నియంత్రణలో ఉందని పోలీసులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో సోమవారం కూడా నిషేధాజ్ఞల అమలు, ఇంటర్నెట్ సేవల నిలిపివేత కొనసాగిందని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం రామనవమి శోభాయాత్ర సందర్భంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలకు సంబంధించి సుమారు 12 మందిని అరెస్టు చేసినట్లు చందన్నగోర్ పోలీస్ కమిషనరేట్ సీనియర్ అధికారి తెలిపారు. 'పరిస్థితులు అదుపులో ఉన్నాయి.

భారీగా పోలీసు బలగాల మోహరింపుతోపాటు నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. కొంత సేపు మాత్రమే మార్కెట్లు తెరిచేందుకు అనుమతించాం... వాహనాల రాకపోకలపై కూడా నిఘా ఉంచాం' అని ఆయన పీటీఐకి తెలిపారు. జిల్లాలో ఆదివారం హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న ప్రాంతాల్లో భద్రతా బలగాలు రూట్ మార్చ్‌లు నిర్వహించాయని పేర్కొన్నారు. సోమవారం ఉదయం కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ అల్లరి మూకలను చెదరగొట్టామని, భద్రత కట్టుదిట్టం చేశామని తెలిపారు. పరిస్థితిని అంచనా వేశాక ఇంటర్నెట్ సేవలను పునఃరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

యూపీఏ అవినీతిపై బీజేపీ వీడియో

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై బీజేపీ ఓ వీడియోను ఆదివారం విడుదల చేసింది. ఇది బీజేపీ విడుదల చేసే 'కాంగ్రెస్ ఫైల్స్'లో మొదటి ఎపిసోడ్ అని, కాంగ్రెస్ పాలనలో అవినీతి, కుంభకోణాలు ఏ విధంగా జరిగాయో చూడాలని ఆ పార్టీ ఓ ట్వీట్‌లో కోరింది. ఈ ట్వీట్‌తో ఓ వీడియోను జత చేసింది. ఈ వీడియో సందేశానికి 'కాంగ్రెస్ అంటే అవినీతి' అని తెలిపింది. కాంగ్రెస్ పరిపాలించిన 70 ఏళ్లలో రూ.48,20,69,00,00,000 దోచుకుంది. ఈ సొమ్మును భద్రత, అభివృద్ధి కోసం అనేక విధాలుగా ఉపయోగించుకుని ఉండవచ్చు' అని తెలిపింది. మూడు నిమిషాల నిడివిగల ఈ వీడియోలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, యూపీఏ హయాంలో ప్రధాన మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ కూడా ఉన్నారు. ప్రజల కష్టార్జితం రూ.48,20,69,00,00,000ను కాంగ్రెస్ దోచుకుందని బీజేపీ ఈ వీడియోలో ఆరోపించింది.

ఈ సొమ్ముతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఉండవచ్చునని చెప్పింది. దేశ భద్రత నుంచి అభివృద్ధి వరకు అనేక పథకాలను పూర్తి చేసి ఉండవచ్చునని తెలిపింది. 24 ఐఎన్ఎస్ విక్రాంత్ విమాన వాహక నౌకలను, 300 రఫేల్ యుద్ధవిమానాలను కొనవచ్చునని, 1,000 మంగళ్ మిషన్స్‌ను నిర్వహించవచ్చునని తెలిపింది. కాంగ్రెస్ అవినీతి వల్ల పడిన భారాన్ని దేశం మోయవలసి వస్తోందని పేర్కొంది. అభివృద్ధిలో దేశం వెనుకబడిందని అభిప్రాయపడింది. రూ.1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం గురించి కూడా ప్రస్తావించింది. కాంగ్రెస్ పార్టీ పరిపాలనలోని చిట్టచివరి పదేళ్లలో జరిగిన అవినీతిని వివరించింది. వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలులో అగస్టావెస్ట్‌లాండ్ సీఈఓ రూ.350 కోట్ల ముడుపులు చెల్లించారని చెప్పింది. టూజీ స్పెక్ట్రమ్ కుంభకోణం విలువ రూ.1.76 లక్షల కోట్లు అని తెలిపింది.

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కుంభకోణం జరిగిందని, కామన్వెల్త్ కుంభకోణం రూ.70 వేల కోట్లు అని, రైల్వే బోర్డు చైర్మన్‌కు ముడుపులు రూ.12 కోట్లు అని వివరించింది. కాంగ్రెస్ అవినీతిలో ఇది చాలా చిన్న భాగం మాత్రమేనని, సినిమా పూర్తి కాలేదని వెల్లడించింది. కాంగ్రెస్ కూడా బీజేపీ అవినీతిపై అనేక ప్రశ్నలు సంధించిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ కంపెనీలకు మోదీ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులు కట్టబెడుతోందని కాంగ్రెస్ దుయ్యబట్టింది.

ఇళ్లులేక జగనన్న కాలనీలు వెలవెల

- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఆవుల శేఖర్

కర్నూలు జిల్లా గూడూరులో జగనన్న ఇళ్ల పరిశీలన

విశాలాంధ్ర -గూడూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నదని, జగనన్న కాలనీలు గృహ నిర్మాణాలు లేక వెల వెల బోతున్నాయని దీనికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రసమితి పిలుపు మేరకు జగనన్న కాలనీలు పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి అయినప్పటికీ మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు స్వాధీనం చేయడంలో అలసత్వం వహిస్తున్నదన్నారు. కర్నూలు జిల్లా గూడూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వ ర్యంలో గ్రామ సచివాలయం ముందు జరిగిన కార్యక్రమంలో శేఖర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా గూడూరు లో దాదాపు 906 ఇళ్ల స్థలాల పట్టాలు పేదలకు ఇచ్చినప్పటికి ఆ కాలనీలో ఒక్క ఇల్లు కూడా పరిపూర్తి కాలేదని, రెండు ఇళ్లు మాత్రమే లెంటెల్ లెవెల్ పూర్తి అయ్యాయన్నారు. మౌలిక వసతులు కూడా లేవని, గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉంటే, అలాంటప్పుడు ఇళ్లు ఎలా నిర్మించుకుంటారని ఆయన ప్రశ్నించారు.చాలా మంది పేదలు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలు ఈ స్థలాలు మాకు వద్దని పట్టాలు వెనక్కి ఇచ్చేస్తామని చెపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇచ్చిన 35 లక్షల ఇళ్ల స్థలాల్లో పక్కా గృహాలు నిర్మించుకోవడానికి ఇచ్చే మొత్తం సరిపోవని, కనీసం 5 లక్షలు రూపాయలు ఇవ్వాలని, ఇనుము, ఇసుక, సిమెంట్ ఉచితంగా ప్రభుత్వమే సరఫరా చేయాలని అప్పుడే పేదలు ముందుకు వస్తారని చెప్పారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు అన్ని మౌలిక వసతులు కల్పించి స్వాధీనం చేయాలని దశలవారీగా సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంల ఆధ్వర్యంలో దశల వారిగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం స్పదించడం లేదని విమర్శించారు. ఈ ధర్నా లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి కృష్ణ, సీపీఐ గూడూరు మండల కార్యదర్శి బి శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిమ్మప్ప, మద్దిలేటి, రాజు, శివనాయుడు, దుబ్బ శీను, అబ్రహం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ సచివాలయం ప్లానింగ్ అధికారి గోవింద్ నాయక్‌కు మెమోరాండం సమర్పించారు.

భీమవరంలో

భీమవరంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఆధ్వర్యంలో సచివాలయ అధికారి పార్వతికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి, నామాన వెంకటేశ్వరరావు, గుబ్బల వెంకటేశ్వరరావు, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఉండి మండలంలోని చిలుకూరు, మహదేవపట్నం గ్రామాల్లో సచివాలయ అధికారులకు వినతిపత్రాలు సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు నాయకత్వంలో సమర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సనపల శ్రీనివాస్, ఉండి మండల కార్యదర్శి తమరాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు తహసీల్దారు కార్యాలయం వద్ద జగనన్న గృహాల లబ్ధిదారులతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కళింగ లక్ష్మణరావు విచ్చేసి మాట్లాడారు. ధర్నా అనంతరం తహసీల్దార్ జీవీ శేషగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి సీపీఐ నాయకులు బి.లక్ష్మీనారాయణ, కొనతల నాగరాజు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. ఆకుతీగపాడు సచివాలయం వద్ద సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సచివాలయంలో విజ్ఞాపన పత్రం అందజేశారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి. లక్ష్మీనారాయణ, వంక అప్పారావు, కొనతల నాగరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అవినీతిపై పోరులో సీబీఐ కీలకం: మోదీ

న్యూఢిల్లీ: అవినీతిపై పోరాటంలో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) ది కీలక పాత్ర అని... 2014 నుంచి సీబీఐ స్వేచ్ఛగా పనిచేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అవినీతితో ప్రజాస్వామ్యానికి పెనుముప్పు అంటూ మోదీ తెలిపారు. సోమవారం ఇక్కడ జరిగిన సీబీఐ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోదీ మాట్లాడుతూ... కీలక వ్యాఖ్యలు చేశారు. అవినీతిపై పోరాటంలో సీబీఐది కీలకపాత్ర అని పేర్కొంటూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి సీబీఐ స్వేచ్ఛగా పనిచేస్తోందన్నారు. అవినీతితో యువతకు చాలా నష్టమన్నారు. సీబీఐ సామాన్యులకు ఆశ, బలాన్ని నింపిందంటూ మోదీ వ్యాఖ్యానించారు. న్యాయం కోసం సీబీఐ బ్రాండ్‌గా అవతరించిందని, అందుకోసమే అనేక సంఘటనల్లో సీబీఐ విచారణను డిమాండ్ చేయడానికి ప్రజలు నిరసనలు చేపట్టారంటూ మోదీ పేర్కొన్నారు. సీబీఐ వంటి వృత్తిపరమైన, సమర్థవం తమైన సంస్థలు లేకుండా భారతదేశం ముందుకు సాగలేదని మోదీ అన్నారు. బ్యాంకు మోసాల నుంచి వన్యప్రాణులకు సంబంధించిన మోసాల వరకు, సీబీఐ పని పరిధి చాలా రెట్లు పెరిగిందని మోదీ వివరించారు. అయితే సీబీఐ ప్రధాన బాధ్యత... దేశాన్ని అవినీతి రహితంగా మార్చడమే నని ప్రధాని అన్నారు. 10 ఏళ్ల క్రితం అవినీతి చేయడంలో పోటీ ఉండేదని, ఆ సమయంలో పెద్ద పెద్ద కుంభకోణాలు జరిగాయంటూ మోదీ చెప్పుకొచ్చారు. అయినప్పటికీ నిందితులు భయపడలేదని, అందుక్కారణం వ్యవస్థలు వారికి అండగా నిలవడమేనని మోదీ ఆరోపించారు. 2014 తర్వాత అవినీతి, నల్లధనానికి వ్యతిరేకంగా తాము మిషన్ మోడ్‌లో పనిచేశామమని, దీంతో మార్పు సాధ్యమైందంటూ ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఎవరికి వ్యతిరేకంగా చర్య తీసుకుంటున్నారో వారు చాలా శక్తివంతులని, వారు సంవత్సరాలుగా ప్రభుత్వం, వ్యవస్థలో భాగంగా ఉన్నారని తెలుసు.. అలాంటివారు ఈ రోజు కూడా వారు కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నారు.. అలాంటి వారిపై సిబిఐ దృష్టి పెట్టాలి, అవినీతిపరులను వదిలిపెట్టకూడదంటూ ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ల్యాప్‌టాప్‌లో పరీక్షలు రాసిన అంధ విద్యార్థులు

విశాలాంధ్ర -రాప్తాడు: దేశంలోనే ప్రప్రథమంగా అనంతపురం జిల్లా రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆరుగురు అంధ విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలను ల్యాప్‌టాప్‌లో రాశారు. వీరు ఎలాంటి సహాయం లేకుండా ల్యాప్ టాప్‌లో పదో తరగతి పరీక్షలు రాయడం విశేషం. ఈ సందర్భంగా డీఈఓ సాయిరాం విలేకరులతో మాట్లాడుతూ... రాప్తాడు ఆర్డీటీ అంధుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఆరుగురు అంధ విద్యార్థులకు ప్రత్యేకంగా సదుపాయాలు కల్పించి ఆరు ల్యాప్‌ట్యాప్‌లు ఏర్పాటు చేయడంతోపాటు ఇద్దరు స్టాండ్ బై లను, సాంకేతిక సిబ్బందిని కూడా కేటాయించామన్నారు. ఏకాగ్రతతో పరీక్షలు సజావుగా రాసేలా వీలు కల్పించామన్నారు. ల్యాప్‌టాప్‌లో ఉన్న ప్రశ్నపత్రాన్ని హెడ్ ఫోన్ల ద్వారా విని జవాబును టైపు చేశారని వెల్లడించారు. సాంకేతిక సమస్యల కారణంగా ఒకవేళ ప్రశ్నలు వినిపించకపోతే వాటిని చదివి వినిపించేందుకు ఇద్దరు రీడర్లను సిద్ధం చేశామన్నారు.

పోలవరం ముంపుపై సర్వే చేపట్టాలి: సీడబ్ల్యూసీ

న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు ముంపుపై తక్షణం సర్వే చేపట్టాలని ప్రాజెక్టు అథారిటీకి, ఏపీ సర్కారుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యుసీ) అల్టిమేటం జారీ చేసింది. ముంపుపై అధ్యయనం కోసం నియమిత కాలపరిమితిని విధించింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ముంపుతోపాటు, ఇతర అనేక సాంకేతిక అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ తెలంగాణ, ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో అన్ని రాష్ట్రాలతో ఏకాభిప్రాయం సాధించాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే సీడబ్ల్యూసీ రెండుసార్లు అన్ని రాష్ట్రాలతో సమావేశం నిర్వహించింది. తాజాగా మరోసారి ఢిల్లీలో సోమవారం మూడో సమావేశాన్ని నిర్వహించింది. ఆయా రాష్ట్రాల అభిప్రాయాలను, అభ్యంతరాలపై మరోసారి చర్చించింది. కేంద్ర జల సంఘం చైర్మన్ కుష్వీందర్ వోరా అధ్యక్షతన సాగిన సమావేశంలో పోలవరం ప్రాజెక్టు ముంపు సమస్యలు, ఇతర సాంకేతిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో తెలంగాణ మరోసారి తన వాదనలను బలంగా వినిపించింది.

వంశధార కాలువలో పడి ముగ్గురి మృతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: వంశధార కాలువలో పడి ముగ్గురు మృతి చెందిన ఘటన కోట బొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ పరిధిలోగల రాజపురం గ్రామ సమీపంలో చోటుచేసు కుంది. మృతి చెందినవారిని తండ్రీ కొడుకులైన కాలేపు నాగరాజు (35), కాలేపు తులసిరావు (9), నాగరాజు స్నేహితుడు వెంకటరావు (30)గా గుర్తించారు. వివరాల్లోకి వెళితే... మృతుడు కాలేపు నాగరాజు స్వగ్రామం నిమ్మాడ ఎస్సీకాలనీ. కాగా నాగరాజు తన భార్య కాలేపు రేవతి రాజాంలో జూట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. తమ పిల్లలు తులసిరావు, కిరణ్మయిలను తన అమ్మ ఏసమ్మ దగ్గర ఉంచి స్థానికంగా చదివిస్తు న్నారు. తమ పిల్లల్ని చూడడానికి నాగరాజు, రేవతి, అదే పరిశ్రమలో పని చేస్తున్న నాగరాజు స్నేహితుడు మన్యం జిల్లా, సీతానగరం మండలం, లచ్చయ్యపేట గ్రామానికి చెందిన వెంకటరావు శనివారం స్వగ్రామమైన నిమ్మాడకు వచ్చారు. ఆదివారం ఉదయం 9.30 నిమిషాలకు స్నానానికని తండ్రీ కొడుకులతో పాటు వెంకటరావు రాజపురం దగ్గర వంశధార ప్రధాన కాలువకు వెళ్లారు. వీరు ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన రేవతి... గ్రామంలో వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. కాగా తులసిరావు మృతదేహం కాలువ నీళ్లలో తేలియాడడం చూసి గ్రామస్తులు వెంటనే రేవతికి తెలిపారు. కాగా ఘటన స్థలం వద్ద నాగ రాజు ద్విచక్రవాహనం, చెప్పులు ఉన్నప్పటికీ వారిద్దరు ఆచూకీ తెలియ కపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, వీఆర్వోతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని కాలువలో గాలింపు చేపట్టారు. రాత్రి 12 గంటల సమయంలో నాగరాజు, వెంకటరావు మృత దేహాలను కాలువలో నుంచి బయటకు తీశారు. మృత దేహాలను స్థానిక ప్రభుత్వ అసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆంధ్రా టెకీ దుర్మరణం

న్యూయార్క్: అమెరికాలో దారుణం చోటు చేసుకుంది. స్నేహితుడి కోసమని విమానాశ్రయానికి వెళ్లిన ఓ భారతీయ అమెరికన్ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. బోస్టన్‌లోని లోగన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మార్చి 28న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మృతుడిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశ్వచంద్ కోళ్ల (47)గా గుర్తించారు. ఆయన అమెరికాలోని తకెడ ఫార్మాస్యూటికల్ సంస్థలో డేటా అనలిస్ట్‌గా పని చేస్తున్నారు. భారత్ నుంచి ఓ సంగీత వాయిద్య కళాకారుడైన తన స్నేహితుడు వస్తున్నాడని తెలుసుకొని.. ఆయన్ని పికప్ చేసుకునేందుకు విశ్వచంద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. తన ఎస్‌యూవీ వాహనంలో విమానాశ్రయం బయట టెర్మినల్-బి వద్ద వేచి చూస్తుండగా, అటువైపు వస్తున్న డార్ట్‌మౌత్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన వాహనం.. ఎస్‌యూవీ వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. సమీపంలో ఉన్న నర్సు వెంటనే స్పందించి విశ్వచంద్‌ను కారునుంచి బయటకి తీసి పరీక్షించింది. అయితే, అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న వారు డార్ట్‌మౌత్ వాహనం నడిపిన మహిళా డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న మస్సాచుసెట్స్ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు అమెరికా మీడియా వెల్లడించింది. మరోవైపు డార్ట్‌మౌత్ వాహనంలోని ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు మరో వాహనంలోకి మార్చారు. ఈ ఘటనపై డ్రాట్‌మౌత్ ట్రాన్స్‌పోర్టు విచారం వ్యక్తం చేసింది. కేసు విషయంలో మస్సాచుసెట్స్ పోలీసులకు సహకరిస్తామని తెలిపింది. మరోవైపు విశ్వచంద్ పని చేస్తున్న ఫార్మా సంస్థ ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. నిబద్ధత కలిగిన ఉద్యోగిని కోల్పోవడం బాధాకరంగా ఉందంటూ మెయిల్ చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆయన కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొంది.

సమంత ఛాన్స్‌ను కొట్టేసిన రష్మిక

విశాలాంధ్ర-హైదరాబాద్: భాషతో సంబంధం లేకుండా అన్ని ఇండస్ట్రీస్‌లో సినిమాలు చేస్తున్న నటి రష్మిక మందన్నా. నేషనల్ క్రష్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు సంపాదించుకున్నారు. బాలీవుడ్‌లోను మూవీస్ చేస్తున్నారు. తొలిసారిగా కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రం 'రెయిన్ బో'లో నటిస్తున్నారు. డెబ్యుటెంట్ శాంతరుబాన్ దర్శకత్వం వహిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. తెలుగు, తమిళ్‌లో రూపొందుతోంది. ఈ చిత్రం రొమాంటిక్ ఫాంటసీగా తెరకెక్కనుంది. ఈ ప్రాజెక్టు ఏప్రిల్ 3న పూజా కార్యక్రమాలు జరుపుకుంది. అతి త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది. కథనాయిక ప్రాధాన్యం ఉన్న సినిమా చేస్తుండటంతో రష్మిక సంతోషం వ్యక్తం చేశారు. "కథను మహిళల కోణంలో చెప్పే సినిమాలో మొదటిసారిగా నటిస్తున్నాను. ఈ పాత్రను మీ ముందుకు తీసుకు రాబోతున్నందుకు సంతోషంగా ఉన్నాను. ఈ చిత్రాన్ని చూసి ప్రేక్షకులు క్రేజీగా ఫీల్ అవుతారు" అని రష్మిక తెలిపారు. రష్మిక అద్భుతమైన అభినయాన్ని ప్రేక్షకులు ఈ సినిమాలో చూస్తారని డైరెక్టర్ పేర్కొన్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ మొదట ఈ సినిమాను సమంతతో ప్రకటించింది. ఏమైందో తెలియదు కానీ సామ్ మాత్రం ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. అనంతరం రష్మిక మందన్నాకు కథను వినిపించగా మూవీని చేసేందుకు అంగీకరించారు. ఈ విషయాన్ని నిర్మాతను అడగగా ఆయన స్పందించారు. ఒక కథ ఎవరికి రాసి పెట్టి ఉంటే వారే చేస్తారని చెప్పారు. 'రెయిన్‌బో' లో దేవ్‌మోహన్ హీరోగా చేస్తున్నారు. ఆయన సమంత సరసన 'శాకుంతలం'లోను నటించారు.

బాలీవుడ్ చిత్రంలో రామ్‌చరణ్ అతిథి పాత్ర

విశాలాంధ్ర-హైదరాబాద్: బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌కు, టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్ కుటుంబాలకు మధ్య మంచి సంబంధాలు ఉన్న సంగతి తెలిసిందే. అందుకే మెగాస్టార్ హీరోగా నటించిన 'గాడ్ ఫాదర్' చిత్రంలో సల్మాన్ ఖాన్ ప్రత్యేక పాత్రలో కనిపించాడు. అందుకే తన సినిమాలో రామ్ చరణ్‌ని నటింపజేసేందుకు సల్మాన్ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. సల్మాన్ ప్రస్తుతం 'కిసి కా భాయ్ కిసి కా జాన్' సినిమా చేస్తున్నాడు. అందులో టాలీవుడ్ హీరో వెంకటేశ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఆ చిత్రంలోనే రామ్‌చరణ్ అతిథి పాత్రలో కనిపంచనున్నట్లు ప్రచారం జరిగింది. 'కిసి కా భాయ్ కిసి కా జాన్' ఓ పాటలో చెర్రీ మెరవనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలోనే ఈ పాటకి సంబంధించిన టీజర్‌ని మూవీ టీం విడుదల చేసింది. 'ఎంటమ్మా' అని సాగే ఈ పాటని రేపు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం ట్విట్టర్‌లో ట్రెండ్ అవుతోంది. ఆ టీజర్‌లో సల్మాన్, వెంకీ మామ పసుపు రంగు చొక్కాలో తెల్ల పంచలో కనిపించారు. పండగ వాతావరణంలా ఉన్న వారిద్దరూ ఓ స్టేజ్‌పై వారిద్దరూ నవ్వుతూ చూస్తుండగా.. ఓ వ్యక్తి ఆ స్టేజ్‌పైకి వెళుతుంటాడు. అయితే.. ఆ వ్యక్తి ఎవరనేది మాత్రం రేపటి విడుదల కాబోయే పాటలో చూడాల్సిందే. అయితే.. అంత ప్రత్యేకంగా చూపిస్తున్నారంటే.. అ వ్యక్తి కచ్చితంగా రామ్‌చరణ్ అయ్యి ఉంటాడని వార్తలు నెట్టింట తెగ హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో.. తో పాటు యాష్ ట్యాగ్లు ట్రెండింగ్ అవుతున్నాయి. అతను రామ్‌చరణ్‌నే అని పలువురు వరుసగా పోస్టులు పెడుతున్నారు. కాగా.. 'కిసి కా భాయ్ కిసి కా జాన్' చిత్రంలో బతుకమ్మ ఆడిన పాట ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఓ బాలీవుడ్ మూవీలో తెలంగాణకి సంబంధించిన బతుకమ్మ సాంగ్ ఉండడంతో టాలీవుడ్ ప్రేక్షకులు సంబరపడిపోయారు. ఆ పాటకి యూట్యూబ్‌లో మంచి రెస్పాన్స్ కూడా వచ్చింది. దీంతో రేపు విడుదల కాబోయే పాటలో రామ్‌చరణ్ గనుక కనిపిస్తే.. ఆ పాట అన్ని రికార్డులను బద్దలుకొట్టే అవకాశం లేకపోలేదు.

ఐపీఎల్ చరిత్రలో కోహ్లీ రికార్డ్

బెంగళూరు: ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌పై అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. కేవలం 49 బంతుల్లోనే 82 పరుగులతో అజేయంగా నిలిచి ఆర్‌సీబీని గెలిపించాడు. ఈ క్రమంలో విరాట్ సూపర్ ఫీట్ సాధించాడు. ఐపీఎల్‌లో 50 అర్ధశతకాలు సాధించిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. ఆసీస్ బ్యాటర్ డేవిడ్ వార్నర్ 60 హాఫ్ సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఇక పంజాబ్ సారథి శిఖర్ ధావన్ 49 అర్ధశతకాలు నమోదు చేశాడు.

ఆరెంజ్, పర్పుల్ క్యాప్ రేసులో..

ప్రస్తుతం ఐపీఎల్‌లో ఐదు మ్యాచ్‌లు జరిగాయి. సీఎస్‌కే ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (92) ఆరెంజ్ క్యాప్ రేసులో తొలి స్థానంతో కొనసాగుతున్నాడు. ఆ తర్వాత ముంబై బ్యాటర్ తిలక్ వర్మ (84), విరాట్ కోహ్లీ (82), కైల్ మేయర్స్ (73), ఫాఫ్ డు ప్లెసిస్ (73) టాప్-5 లో ఉన్నారు. బౌలర్ల విభాగంలో అత్యధిక వికెట్లు తీసిన వారికిచ్చే పర్పుల్ క్యాప్ రేసులో లక్నో సూపర్ జెయింట్స్ పేసర్ మార్క్‌వుడ్ (5 వికెట్లు), రాజస్థాన్ రాయల్స్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ (4 వికెట్లు) పోటీలో ముందున్నారు.

బౌలర్లు రాణించాల్సిందే: రోహిత్

ముంబై: ముంబై ఇండియన్స్ మరోసారి పేలవ ప్రదర్శనతో ఈ ఐపీఎల్‌ను ప్రారంభించింది. ఆదివారం బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. గత సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచిన ఈ జట్టు.. ఈసారైన మెరుగైన ప్రదర్శన చేస్తుందని అభిమానులు ఆశించారు. అయితే.. తొలి మ్యాచ్‌లోనే బొక్కబోర్లాపడింది. దీనిపై కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. బుమ్రా లేకపోవడం పెద్ద లోటేనని పేర్కొంటూ.. తమ బౌలర్లకు సున్నితమైన హెచ్చరికలు జారీ చేశాడు. 'పవర్‌ప్లేలో మాకు గొప్ప ఆరంభం రాలేదు. అయితే తిలక్ వర్మ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. అతడు టాలెంటెడ్ ఆటగాడు. ఆడిన షాట్లు చూస్తే.. అతడి సత్తా ఏంటో తెలుస్తోంది. తిలక్ నిజంగా గ్రేట్. అతడి వల్లే పోరాడగలిగే లక్ష్యాన్ని నిర్దేశించగలిగాం. ఇక మా సామర్థ్యంలో సగం కూడా బ్యాటింగ్ చేయలేకపోయాం. ఇంకో 30.. 40 పరుగులు చేసి ఉంటే బాగుండేది' అని రోహిత్ అన్నాడు. ఇక తాము బంతితో రాణించలేదని రోహిత్ అంగీకరించాడు. టోర్నీకి స్టార్ పేసర్ బుమ్రా పూర్తిగా మిస్సైన నేపథ్యంలో.. బౌలర్లు తమ ప్రతిభను, సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించాడు. 'ఎనిమిది నెలలుగా బుమ్రా లేకుండానే నేను ఆడుతున్నాను. అయితే ఇక్కడ పరిస్థితులు భిన్నం. ఎవరో ఒకరు బాధ్యత తీసుకొని ముందుకు రావాలి. గాయాలనేవి మన నియంత్రణలో ఉండవు కదా.. దాని గురించి మనమేమీ చేయలేం. జట్టులోని ఇతర బౌలర్లు ఎంతో టాలెంటెడ్. మేం వారికి మద్దతు అందించాలి. ఈ సీజన్‌లో ఇది తొలి గేమే.. ఇంకా ఆడటానికి చాలా ఉంది' అని జట్టు పరిస్థితులపై రోహిత్ వివరించాడు.

రేటింగ్స్‌లో స్టార్ స్పోర్ట్స్ సరికొత్త రికార్డ్



హైదరాబాద్: ఐపీఎల్ 2023 సీజన్‌ను అధికారిక టీవీ బ్రాడ్ కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ పండుగ చేసుకుంటోంది. రికార్డు స్థాయి వ్యూయర్‌షిప్స్‌తో కోట్ల రూపాయలు ఆర్జిస్తోంది. టీమిండియా క్రికెట్ మ్యాచ్‌లకు కూడా స్టార్ స్పోర్ట్సే అధికారిక బ్రాడ్ కాస్టర్‌గా ఉండగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు అంచనాలకు తగ్గట్లు రేటింగ్స్ అందుకోలేకపోయింది. ఫలితంగా భారీ నష్టాలను చవిచూసింది. కానీ ఈ మూడు నెలల లెక్కలను ఒక్క ఐపీఎల్ సీజన్‌తో భర్తీ చేసేందుకు స్టార్ స్పోర్ట్స్ సిద్ధమైంది. ఐపీఎల్ 2023 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన తొలి మ్యాచ్‌కు రికార్డు స్థాయిలో వ్యూస్ వచ్చినట్లు ఎక్స్‌చేంచ్4మీడియా అనే సంస్థ పేర్కొంది. మీడియా, చానెళ్లకు సంబంధించిన వ్యూయర్‌షిప్ వివరాలను ఈ సంస్థ వెల్లడిస్తూ ఉంటుంది. ఐపీఎల్ 2023 సీజన్ నేపథ్యంలో స్టార్ స్పోర్ట్స్ వ్యూయర్‌షిప్ 29 శాతం పెరిగిందని ఈ వెబ్‌సైట్ పేర్కొంది. ఐపీఎల్ 2023 సీజన్ తొలి మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్‌లో 14 కోట్ల మంది వీక్షించారని, ఇది 47 శాతం ఎక్కువని తెలిపింది. ఇక ఓటీటీ రైట్స్ అందుకున్న జియో సినిమా యాప్ సైతం రికార్డు సృష్టించిందని, తొలి మ్యాచ్‌ను ఈ యాప్ వేదికగా 6 కోట్ల మంది వీక్షించారని పేర్కొంది. ఒక రోజు అత్యధిక మంది డౌన్ లోడ్ చేసుకున్న యాప్‌గా కూడా జియో సినిమా సరికొత్త రికార్డు సృష్టించినట్లు వెల్లడించింది. తొలి మ్యాచ్ తర్వాత ఆదివారం జరిగిన ఆర్‌సీబీ-ముంబై ఇండియన్స్ మ్యాచ్‌కు కూడా రికార్డు స్థాయిలో వ్యూస్ వచ్చినట్లు పేర్కొంది. స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా పెట్టిన ఖర్చుకు రెండింతలు లాభాలు ఆర్జిస్తున్నట్లు బిజినెస్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే జియో సినిమా యాప్ సేవలపై అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో సాంకేతిక లోపాలున్నాయని, బఫరింగ్ సమస్య ఉందని ఫిర్యాదు చేస్తున్నారు. కామెంట్రీ కూడా చాలా నాసిరకంగా ఉందని, స్టార్ స్పోర్ట్సే చాలా క్వాలిటీ కంటెంట్ ఇస్తుందని కామెంట్ చేస్తున్నారు. ఈ కారణాలతోనే చాలా మంది యూజర్లు ఐపీఎల్ మ్యాచ్‌లను టీవీల్లోనే చూస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. టీవీలు అందుబాటులో లేని వారు మాత్రమే తప్పని పరిస్థితుల్లో జియో సినిమా యాప్‌లో మ్యాచ్‌లను వీక్షిస్తున్నారని ట్విటర్ వేదికగా తెలియజేస్తున్నారు. ఐపీఎల్ 2023 నుంచి 2027 సీజన్ వరకు ప్రసార హక్కులను నాలుగు విభాగాలుగా విభజించగా.. బీసీసీఐ ఖజానాలోకి రూ.48,390.52 కోట్ల భారీ మొత్తం చేరింది. టీవీ ప్రసార హక్కుల కోసం బీసీసీఐకి రూ.23,575 కోట్లు చెల్లించేందుకు స్టార్ నెట్‌వర్క్ సిద్ధమవ్వగా.. డిజిటల్ రైట్స్‌ను అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.23,773 కోట్లు చెల్లించనుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.